ENTERED

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
5 జూన్, 2011

అందం వెనుక అమానుషం

suryarao tamvada @ gmail.com

హ్యాపీ బర్త్‌డే

(2011 జూన్ 5 నుంచి
2011 జూన్ 11 వరకు)

పి.సౌజన్య
6సం॥, జూన్-2005
సుజాత-గణేష్
పలగర-విజయనగరం

జె. చందు-గిరి
జూన్-5
బాలమణి-సత్యనారాయణ
ఇబ్రహీంపట్నం-రంగారెడ్డి

ప్రభాత్
7సం॥, జూన్-6
నిర్మల-హరికిషోర్
హైదరాబాద్

ఎం. సత్యప్రియ
8సం॥, జూన్-10
రజని-హరినాథ్
మచిలీపట్నం

డింపుల్ వర్ధని
జూన్-5
పద్మరాణి-బ్రహ్మాజి
పడమట-విజయవాడ

డి.శ్రీరాంవినీత్
3సం॥,జూన్-2008
శ్రీలత-లవరాజు
పట్టాభిరెడ్డి
గార్డెన్-విశాఖ

పి.నాగధనుష్(పండు)
జూన్
శివపార్వతి-నాగేశ్వరరావు
నందిగామ-కృష్ణా

వై. చరణ్(చెర్రి)
2సం॥,జూన్-6
ఎస్తేరురాణి-గురుకుమార్
మార్కాపురం-ప్రకాశం

పి.సాయిలక్ష్మీప్రవల్లిక
జూన్-8
శ్రీదేవి-చక్రవర్తి
గాజువాక-విశాఖ

జి.రిషీంద్రగౌడ్
3సం॥,జూన్-2008
లత-మల్లేశ్
పెద్దకోడూరు-మెదక్

వి.ప్రణీత్
జూన్-6
విజయలక్ష్మి-ఉత్తమ్‌కుమార్
రోటరీనగర్-ఖమ్మం

ENTERED

మనలో మాట

నిరసనాస్త్రాలు...

నిరసన ముందు పుట్టిందా? నిదానంగా వ్యక్తీకరించే భాష ముందు పుట్టిందా? అంటే నిరసనే ముందు పుట్టిందని మనం ఒప్పకొని తీరాలి. అప్పటిదాకా బోసినవ్వులు చిందించిన చిన్నారి ఆకలేసినప్పడు- ఆరున్నొక్క రాగం అందుకుంటాడు. దాంతో, ఇంట్లో ఉన్నవాళ్లంతా అలర్టయిపోతారు. కావల్సినదేమిటో తెలుసుకొని సమకూర్చటానికి పరుగులు తీస్తారు. ఈలోగా ఎంత బుజ్జగించినా, ఎన్ని బొమ్మలిచ్చినా ఫలితం ఉండదు. కావాల్సిన పాల సీసా నోటికందేదాకా రాగనిరసన ఆగదు. అవసరమైన దానికోసం అరచి చెప్పాల్సి రావడం బాల్యంనించే మొదలవుతుందన్న మాట! ఏ దేశమైనా, ఎవరి బిడ్డయినా, ఏ భాష వాళ్లయినా నిరసనొక్కటే!

ఉయ్యాలనాడు మొదలైన ఈ నిరసనోద్యమం జీవితాంతం సాగుతూనే ఉంటుంది. పనికి తగిన వేతనం కోసం, 'ఉద్యోగులుగా' గుర్తించడం కోసం, ఆఖరికి చేసిన ఒప్పందాలను అమలు చేయమనడం కోసం .... ఆందోళనలు చేపట్టాల్సి వస్తోంది. ఒకప్పడైతే- అసంతృప్తి నివారణ కోసం సంబంధికులు ఆగమేఘాల మీద కదిలేవారు. కోర్కెలేమిటో తెలుసుకొని సాధ్యమైనంత వేగంగా వాటిని నెరవేర్చేవారు. పాత కాలంలో అలగటమే పెద్ద నిరసన రూపం. అల్లుడికైనా, ఆలికైనా అలకపాన్పే పెద్ద దీక్షాశిబిరం. గాంధీకాలంలోనూ నిరసనకు మంచి స్పందనే ఉంది. విదేశీ వస్త్రాల దగ్ధం, ఉప్ప సత్యాగ్రహం అప్పట్లో ప్రబలమైన నిరసన రూపాలు. పాలకులు పరాయివాళ్లయినా ఎంతోకొంత స్పందించేవారన్నమాట.

ఇప్పడు చాలామంది పాలక పెద్దలు జనోద్ధరణ మానేసి, స్వీయోద్ధరణ మొదలెట్టారు. అందుకనే సమస్యలపై ఆందోళనలు చేపడుతున్న జనం గోడు వారి చెవులకు సోకటం లేదు. ప్రజల అవసరాలపై, అసంతృప్తులపై స్పందించే గుణం, సరిచేసే లక్షణం మృగ్యమైపోతున్నాయి. సమస్యలపైనే కాక అంగీకరించిన అంశాలు, చేసుకున్న ఒప్పందాల అమలు కోసమూ ఉద్యమించాల్సిన విచిత్ర పరిస్థితి నెలకొంది. పాలకుల చెవులు దిబ్బడించి, శరీర స్పర్శ మందగించి ... ప్రజల నిరసనల హోరు పట్టడం లేదు. ఈ పట్టనితనాన్ని బట్టబయలు చేసి, చలనం కలిగించటానికి నిరసన రూపాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి.

పాలకుల మాటలు నమ్మదగ్గవి కానప్పడు చెవిలో పువ్వు, ఎంతకీ స్పందించకపోతే- దున్నపోతుకు వినతిపత్రం, ఏలినవాళ్ల హయాంలో శ్రామికుల పరిస్థితి ఇదని బిక్షమెత్తడం, పాలనకు ప్రతీకగా వెనక్కి నడవడం, మోకాళ్లపై నించోవడం; సమస్య పట్టని సర్కారు దిష్టిబొమ్మ దగ్ధం ... ఇంకా- రిక్షా తొక్కడం, వీధులు ఊడ్వడం, బూట్లు తుడవడం, ఉరికి వేలాడడం, అర్ధనగ్న ప్రదర్శన, తలనీలాల సమర్పణా.... ఒకటేమిటి? అనేకనేక నిరసన రూపాలు. ఒకదానికి కాకపోతే ఒకదానికైనా సర్కారు పెద్దలు స్పందిస్తారనే తాపత్రయం. అంతకుమించి జనం దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లే ప్రచార వ్యూహం!

'తిట్టిపోదురు గాక మాకేటి సిగ్గు..!' అన్నట్టు ప్రభుత్వం తొలుత బింకం ప్రకటించినా ఏదొకరోజు దిగిరాక తప్పదు. ఎందుకంటే- నిరసన ఒక ఆయుధం. గురి చూసి కొట్టే సాధనం. జనాన్ని గడ్డిపోచల్లా తీసేస్తే తగిన ప్రతిఫలం అనుభవించాల్సి వస్తుంది. గడ్డిపోచలన్నీ కలిసి గజాన్ని బంధించినట్టన్నమాట. నిరసన అస్త్రాలను పట్టించుకోకపోతే పాలకులు ఒక్కోసారి వాటికి తమ అధికార పీఠాలను మూల్యంగా చెల్లించుకోవల్సి వస్తుంది! ప్రజా నిరసనల పవరు అదీ మరి!

★

ఈ సంచికలో....

టపా	...	2
ఈ పేజ్	...	3
కవిత్వమ్	...	6
నవ్వుల్ పువ్వుల్	...	7
రుచి	...	9
కెరటం	...	10
చిన్న కథ	...	11
చూద్దామా	...	12
అట్టమీది కథ	...	14
కథ	...	18
కొత్త పుస్తకాలు	...	21
బాలనేస్తాలు	...	22
మాటల కోట	...	24

ఇంకా...

ఆరోగ్యం ... 4

ఒత్తిడి అనే చక్రవ్యూహంలో....

సినిమా కబుర్లు ... 8

యాడ్స్ కూడా గ్లామర్‌కు యాడ్?

వికాసం ... 20

చిత్రమైన మనుషులు విచిత్రమైన ప్రవర్తనలు



కన్నీళ్లు పెట్టించింది

అట్టమీది కథ "పరిమళించిన పల్లె" చదివాం. ప్రతి ఊళ్లో రాజమౌళి లాంటి నాయకులు ఉండి పల్లెల్ని అభివృద్ధి బాటలో నడిపిస్తే ఎంత బావుండనిపించింది. నవ్వుల్ పువ్వుల్ నవ్విస్తున్నాయ్. అల్లు శిరీష్ గురించి 'ఉరకలు వేసే ఉత్సాహం' వ్యాసం యువతకు ఆదర్శవంతంగా ఉంది. అనువాద కథ 'అంతా గప్‌చుప్' కంట నీరు తెప్పించింది.

మోతీ మోహనరంగా,
సూర్యాపేట్.

అందరికీ ఆదర్శం

రెండు నెలల పాటు అమెరికా యాత్రను హాయిగా జరిపించారు రావెల సాంబశివరావు. ఒసామాను ఎవరు ఎంత పొగిడినా అతను తీవ్రవాదే. కుక్కకాటుకు చెప్పుదెబ్బ కాదు, ఓటు దెబ్బ చూపిస్తే కానీ ప్రజాప్రతినిధులు బాగుపడరు. రుచులు బాగున్నాయి. గంగదేవిపల్లిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలి.అమ్మమాట వింటే బిడ్డలకు ఆపదలు రావు. చైనా బిడ్డ అంత సోమరిగా ఎదిగితే ఎలాగండీ?

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

గుబాళించిన మానవత్వం

ఈవారం సంచిక సకలాంశ శోభిత నూతనత్వ పరిమళాలను గుబాళింపజేసింది. ప్రతి అంశం దేనికదే ప్రత్యేకతను చాటుకుంది. ముఖ్యంగా 'అట్టమీది కథ' గ్రామశోభను పరిమళింపజేసింది. పల్లె సొగసులు, పచ్చదనాల రంగులతో పాటు మంచితనాల హంగులను అద్ది గ్రామాలకే వన్నె తెచ్చిన గంగదేవిపల్లి గ్రామం ఓ అపురూపం. కలలుగనే చల్లని గాలులు, పచ్చని సొగసులు ఆ పల్లె సొంతం. మున్ముందు మరింత ఆదర్శవంతంగా కావాలని మనసారా కోరుకుంటున్నాం. మామిడి చారు, పచ్చి పులుసు రుచికి రుచి, ఆరోగ్యానికి ఆరోగ్యం.

టి.వి.డి.ఎస్.సీతారామారావు,
విజయవాడ.

నమ్మలేని నిజం

వేటూరి పాటల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆయన కలానికి రెండు వైపులా పదునే. దానికి ఉదాహరణ 'మాతృదేవోభవ'లో వేణువై వచ్చాను భువనానికి.... పాటతో కంట నీరు పెట్టించి, 'ఆర్య'లో అ... అంటే అమలాపురం అంటూ కుర్రకారును హుషారెత్తించారు. 'సినిమా కబుర్లు' సరదాగా, కొత్త అంశాలతో బాగుంటున్నాయి. అల్లు అరవింద్ కుమారుడు శిరీష్ గురించి మాకు తెలియని వివరాలు తెలియజేశారు. 'చూద్దామా'లో విచిత్ర వేషాల జాతర గురించి తెలుసుకున్నాం. తిరుపతి వంటి పెద్ద నగరాల్లో కూడా ఇంకా ఇటువంటి జాతరలు చేస్తున్నారంటే నమ్మలేకపోతున్నాం.

విజయ్, గుంటూరు.

అందరూ అలాగే ఆలోచిస్తే...

'అట్టమీది కథ'లో చెప్పిన గంగదేవిపల్లి గ్రామంలా అన్ని వూళ్లు ఉంటే ఎంత బాగుంటుందో కదా? అనిపించింది. అన్ని గ్రామాల్లోని సర్పంచులూ రాజమౌళిలా ఆలోచించి గ్రామ సమస్యలను పరిష్కరించడానికి పూనుకుంటే బావుంటుంది. 'అంతా గప్ చుప్!' కథ చదువుతున్నంత సేపూ గుండెల్ని పిండేసినట్లయింది. ఉక్కు, బొగ్గు కర్మాగారాల్లో పని చేసేవారి జీవితాలు ఇంతేనేమో! ఏ క్షణం ఏమౌతుందో తెలీదు. అన్నీ తెలిసి కూడా కార్మికులు ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. వారికి, వారి కుటుంబాలకు యాజమాన్యమే



తగిన భద్రత కల్పించాలి.

యాదగిరి, కరీంనగర్.

నిరంతర పోరాటం

'తెల్సా'లో కాళ్లతో కళాఖండాలు బాగుంది. అన్ని అవయవాలు సరిగా ఉండి రోజులను ఆషామాషీగా గడిపేవాళ్లు, తమకు ఎవరూ సరైన ప్రోత్సాహం అందించడం లేదనుకునేవాళ్లు చాలామంది ఉన్నారు. అలాంటి వాళ్లకి 'హువాంగ్ గోవు' చక్కటి ఉదాహరణ. ఈ వారం 'కథ' బాగుంది. కార్మికులకు, యాజమాన్యానికి నిరంతరం హక్కుకోసం పోరాటం జరగాల్సిందే. లేకపోతే సందీప్ జీవితంలా అవుతుంది కార్మికుల పరిస్థితి. 'ఈపేజ్'లో ఫేస్ బుక్ వివరాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. వేటూరి పాటలను 'జ్ఞాపకాలు' లో మరోసారి మననం చేసుకున్నాం.

సాయిరాం, ప్రకాశం.



ఇంక సిమ్ కార్డ్ అక్కర్లా...!

సెల్ ఫోన్ ఉపయోగించే వారందరికి అది అత్యవసరం. సెల్‌ఫోన్ ధరతో సంబంధమే లేదు. అది అత్యంత ఖరీదైనదయినా, చవకబారుదయినా అందులో తప్పనిసరిగా వుండాల్సింది సిమ్‌కార్డు. ఒక్క మాటలో చెప్పుకోవాలంటే సెల్‌ఫోన్‌కు సిమ్‌కార్డు గుండెకాయ వంటిదనుకోండి. అంత ముఖ్యమైన సిమ్‌కార్డ్‌లకు ఇప్పుడు పెద్ద ముప్పు వచ్చిపడిందంటే నమ్ముతారా! మరికొన్నాళ్ళకు సిమ్ అనే పదమే దాదాపు వినపడదంటే విశ్వశిస్తారా? సిమ్‌కార్డ్‌లన్నింటినీ చెత్తకుప్పలో పడేయాల్సిందేనంటే ఒప్పుకుంటారా?



'ఏదేదో చెప్పేస్తున్నారుకానీ అసలు సిమ్ లేకుండా సెల్ ఎలా పనిచేస్తుంది బాస్...?!' అనుకోవద్దు. సాంకేతిక రంగంలో మరో అద్భుతం ఆవిష్కృతం కాబోతోంది. త్వరలో రాబోతున్న ఈ కొత్త సాంకేతికత సిమ్‌కార్డ్‌లకు ఎర్త్ పెడుతోంది. ఇది పచ్చి నిజం.

ఏ సర్వీస్ ఉపయోగిస్తున్నారు...? సిగ్నల్స్ బాగా ఉన్నాయా....? నీ సిమ్‌కార్డ్ పోయిందా...? అందులో డేటా మిస్ అయ్యిందా...? లేకపోతే సిమ్‌కార్డ్‌కు డస్ట్ పట్టింది.... క్లీన్ చేసినా సిమ్ పనిచేయటం లేదా...? ఈ మాటలన్నీ ప్రతినిత్యం ఎవరో ఒకరి నోటివెంట వింటూనే వుంటాం. ఇప్పుడు సెల్‌ఫోన్ వాడని వాళ్ళు దాదాపు లేరనే చెప్పవచ్చేమో. సెల్‌ఫోన్ వాడే ప్రతిఒక్కరికీ సిమ్‌కార్డ్‌ల గురించిన అవగాహన ఎంతోకొంత తప్పనిసరిగా వుంటుంది. ఈ సెల్‌ఫోన్‌ల వాడకంలో వచ్చిన సునామీ అటువంటిది మరి. అయితే అసలు సిమ్‌కార్డ్ అంటే 'సబ్‌స్క్రయిబర్ ఐడెంటిటీ మాడ్యూల్' అన్న విషయం తెల్సిన వాళ్ళు అతికొద్ది మందే.

అసలు విషయానికొస్తే సాంకేతిక రంగంలో కొత్తకొత్త ఆవిష్కరణలు ఎప్పుడూ జరుగుతూనే వుంటాయి. అలా మొబైల్ రంగంలో కూడా అనేక నూతన ఆవిష్కరణలు తెరమీదకు వస్తున్నాయి. అందులో భాగంగా వచ్చిందే వర్చువల్ సిమ్. ప్రపంచ సాంకేతిక రంగంలో ఇదో అద్భుతం. ఈ సరికొత్త ఆవిష్కరణ పేరులో సిమ్ అనే పదం ఉన్నా ఇది సిమ్‌కార్డ్ కాదు. ఇప్పటి వరకూ సిమ్‌కార్డ్ తీసుకోవాలంటే అనేక రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ తప్పనిసరి. కానీ వర్చువల్ సిమ్‌కు అలాంటిది లేదు. అయితే ఈమెయిల్ ఐడీ తప్పక ఉండాలి. దాంతో కేవలం మీ యూజర్ నేం, పాస్‌వార్డ్ టైప్ చేసి కొత్త నెంబర్ పొందవచ్చు. పోయిన సిమ్‌కార్డ్ నెంబర్‌నూ తిరిగి పొందవచ్చు. అంతేకాదు పోయిన మీ సిమ్‌కార్డ్‌లో డేటా కూడా తిరిగి సంపాదించవచ్చు. 2009 సంవత్సరం వరకూ డ్యూయల్ సిమ్ ఫోన్ అనే పదం చాలా మందికి తెలీదు. అంటే ఒకే ఫోన్‌లో రెండు సిమ్‌కార్డ్‌లు వాడటం. అసలు అలాంటి మొబైల్ వచ్చిందన్న విషయాన్ని చాలా మంది నమ్మలేదు. ఇదే వింత అనుకుంటే.... ప్రపంచంలోనే మొదటిసారిగా నాలుగు సిమ్‌కార్డులతో ఉపయోగించే మొబైల్ ఫోన్ విడుదలైంది. 'ఎఫ్ 160 క్వాడ్ సిమ్' పేరుతో విడుదలైన నాలుగు సిమ్ కార్డుల మొబైల్‌ను ఫొటోలో చూడొచ్చు.



అయితే ఇప్పుడు డ్యూయల్ సిమ్ ఫోన్‌ల వాడకం సర్వసాధారణం అయిపోయింది. ఎక్కడపడితే అక్కడ మార్కెట్లో దొరుకుతున్నాయి. బ్రాండెడ్ కంపెనీలవి కొంచెం ఎక్కువ రేటు.... ఇక చైనా మొబైల్స్ సంగతి చెప్పనే అక్కర్లేదు. ఇప్పుడు నాలుగు సిమ్‌ల ఫోన్లు కూడా వచ్చాయి. అయితే వర్చువల్ సిమ్‌తో ఒకేసారి ఆరు నెంబర్లు వాడొచ్చు. అంటే ఐడియా, ఎయిర్‌టెల్, బిఎస్‌ఎన్ఎల్, వోడాఫోన్, యూనినార్ ఇలా... అన్ని కంపెనీల నెంబర్లనూ ఒకే ఫోన్‌తో ఎంజాయ్ చేయవచ్చు. కాకపోతే ప్రతి నెంబర్‌కూ ఒక పాస్‌వార్డ్ పెట్టుకోవాలి. ఎందుకంటే ఇది సిమ్‌కార్డ్ కాదు. కేవలం యూజర్ నేం, పాస్‌వార్డ్‌తో యాక్టివేట్ అయ్యే సాఫ్ట్ సిమ్.

ఈ టెక్నాలజీ కంపెనీలకు ఉపయోగమా? వినియోగదారులకు ఉపయోగమా? అంటే ఖచ్చితంగా తమకే ఉపయోగమంటున్నాయి పలు కంపెనీలు. ఎందుకంటే ఒక సిమ్‌కార్డ్ తయారీ నుంచి కస్టమర్‌కు వెళ్లే వరకు కంపెనీలకు అయ్యే ఖర్చు దాదాపు వంద రూపాయలు. ప్రతిసారీ సిమ్ అప్ డేట్, కొత్త సిమ్ తయారీ, దాని అప్‌డేషన్ వంటి అనేక దొంతరలు వుండడం వల్ల జరిగే ఆలస్యం వినియోగదారుని కొంత అసౌకర్యానికి గురిచేస్తోందనేది కంపెనీల వాదన. ఇక వర్చువల్ సిమ్ వల్ల వినియోగదారునికీ నెంబర్ పొందటం సులువని చెబుతున్నాయి. ఈ టెక్నాలజీ అందుబాటులోకి వస్తే సెల్‌ఫోన్‌లో సిమ్ కార్డుల గొడవ తప్పుతుంది.

ఏమంటారు యూజర్జీ?

- కె.ఎక్స్.రాజు

ఆరోగ్యం

ఒత్తిడి అనే చక్రవ్యూహంలో...

ఇరవై ముప్పై ఏళ్ల క్రితం ఒత్తిడి అంటే పెద్దగా పట్టించుకునే వాళ్లం కాదు. దీని గురించి చర్చ ఉండేది కాదు. కానీ ఇప్పుడు మానసిక వైద్యనిపుణుల దగ్గరకు వచ్చే ప్రతి ఐదు కేసుల్లో రెండు కేసులు పని ఒత్తిడితో అవస్థలు పడేవే. అసలు ఈ మార్పు ఎందుకొచ్చింది? కారణాలేంటి? దీన్ని ఎలా మేనేజ్ చేయాలి? ఎలాంటి చికిత్స ఉంటుంది? తెలుసుకుందాం...

ఒత్తిడి గురించి చర్చించే ముందు రెండు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఒకటి ఆర్థిక భారం పెరగడం. ఈ రోజు అవసరాలు పెరిగిపోయాయి. దానికనుగుణంగానే ఖర్చులు అధికమయ్యాయి. ధరలకు రెక్కలొచ్చాయి. ఈ ఇరవై ఏళ్లలో పిల్లల చదువుకు అయ్యే ఖర్చు, ఒక కుటుంబానికి అయ్యే ఖర్చు నాలుగు నుంచి ఆరు రెట్లు పెరిగింది. ఈ పరిస్థితుల్లో కుటుంబభారం మోసేవారిలో ఒక ఆలోచన తప్పనిసరిగా ఉంటుంది. "ఈ నెల ఆదాయం ఎంత వస్తుంది? ఎంత అవసరం? అన్ని ఖర్చులు పోను ఎంత మిగులుతుంది? ఎంత పొదుపు చేయగలుగుతాను. జీతం సరిపోతుందో లేదో? అనే ఆలోచనలు చుట్టుముడతాయి' ఈ నేపథ్యంలో ఆ వ్యక్తి ముఖంలో, ఆలోచనల్లో తాజాదనం ఉండదు. నీరసంగా ఉంటారు. పనిలో చురుకుదనం తగ్గుతుంది. ఇంట్లో, ఆఫీసులో కొన్ని లక్ష్యాలుంటాయి. ఆఫీసులో అయితే.... ఇచ్చిన పనిని ఎన్ని రోజుల్లో పూర్తి చేస్తారు? ఎప్పుడు పూర్తిచేస్తారు? పైనుంచి ఆదేశాలు, ఒత్తిళ్లు, చీవాట్లు రావడం ఎక్కువౌతుంది. టైం తక్కువ పని ఎక్కువ. టైం ఉండి ఫ్రీగా పనిచేసుకోమంటే మనసుపెట్టి, పనిని ఇంకా త్వరగా పూర్తి చేయాలనే పట్టుదల పెరుగుతుంది. తక్కువ సమయం, ఎక్కువ పని వల్ల మానసిక రుగ్మతకు బీజం వేసినట్లే. ఇలా లక్ష్మణ రేఖ గీసినప్పుడు ఈ సమస్యలు వస్తాయి.

విశ్రాంతిలేని ఉద్యోగాలు

ప్రతి మనిషికి ఎన్ని గంటలు పనిచేసినా, పని పూర్తయ్యాక కాస్త విశ్రాంతి అవసరం. ఎక్కువ గంటలు పనిచేయడం వల్ల లేదా సేద తీరడానికి సమయం లేకపోడం వల్ల ఒత్తిడి పెరుగుతోందా? అన్నది విశ్లేషించుకోవాలి. ఎందుకంటే ఎక్కువ సమయం పనిచేయడం వల్ల సేదతీరే సమయం కుంచించుకుపోతోంది. ఈ మధ్యకాలంలో టైంబౌండ్ పనులు, ఉద్యోగాలు పెరుగుతున్నాయి. వర్క్‌రూల్స్ ప్రకారం 8 గంటలు పనిచేయాలి. కానీ 8 నుంచి 12, 14 గంటల వరకు పనిచేసేవారున్నారు. ఇన్ని గంటలపాటు పనిచేయడం ఒక ఎత్తయితే ఇంటికి వెళ్లడానికి అయ్యే సమయం కూడా ఎక్కువౌతుంది. ఒత్తిడితో ఉన్న సమయంతో ఇంటికి వెళ్తున్నారు. విపరీతమైన ట్రాఫిక్‌లో, కిక్కిరిసిన బస్సులో ఇంటికి వెళ్లడం సాధారణమైంది. విపరీతమైన కాలుష్యం కూడా ఒత్తిడిని మరింత పెంచేస్తుంది. ఇంటికి వెళ్లిన తర్వాత పిల్లల గురించి, కుటుంబ సమస్యల గురించి భార్యతో మాట్లాడడం కనుమరుగయ్యాయి. కష్టసుఖాలు చర్చించుకునే సమయం లేదు. రేపు మాట్లాడదాంలే అని అనుకోవడం వల్ల రోజుల కొద్దీ సమస్యలు వాయిదా పడుతున్నాయి. ఇలా తినడం అలా కొద్దిసేపయ్యాక పడుకోవడం జరుగుతోంది. దీని వల్ల సేదతీరడానికి సమయం దొరకడం లేదు. ఒత్తిడితో ఇంటికి వచ్చిన వ్యక్తి ఒత్తిడితోనే నిద్రపోతున్నాడు. ఒత్తిడితో నిద్రోపోయినప్పుడు పడుకున్నాడన్న మాటే గాని నిద్రరాదు. సరిగ్గా నిద్రలేకపోవడం వల్ల హుషారుతనం పోతుంది. ఆఫీసుకు వెళ్తారు. కానీ కొత్తదనం కనిపించదు. జీవితం అంతా ఉరుకులు పరుగులే. ఇదంతా ఒక చట్రంలా తిరుగుతుంటుంది. ఈ చక్రవ్యూహం నుంచి బయటపడలేక ఒత్తిడిలో కూరుకుపోతాడు.

డాక్టర్ కళ్యాణచక్రవర్తి
మానసిక వైద్యనిపుణులు
రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పిటల్
బంజారాహిల్స్,
హైదరాబాద్.
96666 95955

గుండె కుదేలవుతుంది

ఒత్తిడి ఒత్తిడి రూపంలో ఉంటే ఎలాంటి సమస్య ఉండదు. చెట్టుకు కొమ్మలు ఎలా ఉంటాయో ఒత్తిడికి కూడా అలాంటి కొమ్మలుంటాయి. ఈ కొమ్మలు చిగురించి బలమైన కొమ్మలుగా మారి, నరకడానికి వీలులేనివిధంగా తయారవుతాయి. ఎందుకంటే ఈ రోజుల్లో ఎటువంటి అనుమానం లేకుండా నిరూపమైంది. ఒత్తిడికి శారీరక ఆరోగ్యానికి అవినాభావ సంబంధం ఉంది. ఎంత ఒత్తిడితో ఉంటే అంత శారీరక అనారోగ్యంగో ఉన్నట్లు. ఎక్కువగా గుండెపోటు వచ్చిన కేసులను పరిశీలిస్తే వీరిలో బిపి, షుగర్ ఉండడం లేదు. చెడు వ్యసనాలు ఉండడం లేదు. అయినా కూడా గుండె జబ్బులు రావడం జరుగుతోంది. తర్వాత ఇక బైపాస్, యాంజియోప్లాస్టీ మామూలే. గుండెలో నొప్పి అని కార్డియాలజిస్టును కలిసే ప్రతి పది మందిలో నలుగురిని మానసిక వైద్యనిపుణులను కలవాలని వారు సూచిస్తున్నారు. పని ఒత్తిడి పెరగడం వల్ల, పని ఒత్తిడిని తట్టుకునే శక్తి లేకపోవడంతో వీరికి గుండెపై విపరీతమైన భారం పడుతోంది. ఒత్తిడి ఉన్న మనిషికి సెరిటనిన్ అనే రసాయనం అవసరానికి మించి బాగా తగ్గిపోతుంది. నరాల మధ్య ఉన్న గ్యాప్‌లో ఈ సెరిటనిన్ తగ్గిపోతుంది. రక్తప్రసరణలో నార్‌ఎడ్రినలిన్ రసాయనం విపరీతంగా పెరుగుతుంది. ఈ రెండు కారణాల వల్ల గుండెపై విపరీతమైన ఒత్తిడి పడుతుంది. ఈ సందర్భాల్లో గుండె కొట్టుకునే విధానంలో మార్పు వస్తుంది. అంటే లబ్‌డబ్ లబ్‌డబ్‌ల మధ్య గ్యాప్ తగ్గిపోతుంది, లేదా పెరిగిపోతుంది. రక్తంలో ఈ రెండు రసాయనాల అసమతుల్యం వల్ల మార్పులు కలుగుతాయి.

ఇతర అవయవాలు కూడా

గుండె మీద ఒత్తిడి వల్ల శరీరంలోని ఇతర అవయవాలకు వెళ్లే రక్తప్రసరణలో కూడా మార్పులు వస్తాయి. మార్పులు జరిగినప్పుడు కీలక అవయవాల్లో మార్పులు నెమ్మదిగా మొదలౌతాయి. 'అక్యూట్ స్ట్రెస్ ఈజ్ బెటర్ దేన్ క్రానిక్ స్ట్రెస్' అంటారు. అంటే అకస్మాత్తుగా ఒత్తిడికి లోనయితే దాని నుంచి వచ్చే శారీరక మార్పు దీర్ఘకాల ఒత్తిడి కన్నా మేలని. ఐదేళ్లు ఆపైన దీర్ఘకాలిక ఒత్తిడితో ఉన్నవారికి ఆయుష్షు ఆరు నెలలు తగ్గుతుందని ఒక పరిశోధన విశ్లేషించింది. పది సంవత్సరాలు ఇలా ఉంటే ఏడాది జీవనకాలం తగ్గుతుందని గుర్తుపెట్టుకోవాలి. దీనికి తోడు ఆయుష్షు తగ్గడమే కాకుండా ఇలాంటి వారికి అకస్మాత్తుగా గుండె జబ్బు వచ్చే అవకాశం ఉంది. మనకు 'హార్ట్ సెన్సిటివ్ ఇండెక్స్' ఉంటుంది. అంటే గుండెకు తట్టుకునే శక్తి అని అర్థం. ఇది బాగా తగ్గిపోవడం వల్ల ఇదివరకు లాగా తట్టుకునే శక్తి ఉండదు. దీని వల్ల హార్ట్ అటాక్ వస్తుంది. గుండె ద్వారా మెదడుకు వెళ్లే రక్తప్రసరణపై కూడా ఒత్తిడి ప్రభావం

ఉంటుంది. ఫలితంగా మనిషికి ఆలోచించుకునే శక్తి తగ్గిపోతుంది. ఆలోచించి ఏదైనా నిర్ణయం తీసుకుకోలేడు. దీంతో తప్పులు జరుగుతాయి. దీంతో మళ్లీ ఒత్తిడి మరింత అధికమవుతుంది. ఇదొక వలయంలాగా జరుగుతుంది. దీర్ఘకాలిక ఒత్తిడితో ఉన్నవారిలో బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశం రెండు రెట్లు ఎక్కువ. అంతేకాదు ఇటువంటి వారిలో క్యాన్సర్ వచ్చే అవకాశం ఎక్కువని తాజా పరిశోధనలు తెలుపుతున్నాయి. ఒత్తిడి వల్ల రసాయనాల కలిగే మార్పు వల్ల పేగు, ఊపిరితిత్తుల, ఎండోక్రైన్ అవయవాల క్యాన్సర్లు వచ్చే అవకాశముందని పరిశోధనలో రుజువైంది. ఈ ప్రభావం కిడ్నీలపై కూడా ఉంటుంది. మధుమేహం ఉండేవారిలో ఒత్తిడి వల్ల రక్తనాళాలు దెబ్బతింటాయి. ఒత్తిడి వల్ల జరిగే అనవసరమైన రసాయనాల మార్పు వల్ల రక్తనాళాలు సన్నబడతాయి. అప్పటికే దెబ్బతిన్న రక్తనాళంమీద అక్కర్లేని రసాయనం వల్ల దానిపై పడే ఒత్తిడి ఒకటి రెండు రెట్లు అధికమవుతుంది. దీంతో కిడ్నీలపై ప్రభావంపడి, త్వరగా కిడ్నీ డయాలసిస్ అవసరం రావొచ్చు.

అసంతృప్తి...

ఒత్తిడి మానసికంగా దెబ్బతీయడమే కాక సంసార జీవితంలో కూడా అలజడి రేపుతుంది. పురుషుల్లో అంగస్తంభన కలుగుతుంది. స్త్రీలలో అసంతృప్తిని కలిగిస్తుంది. ఆందోళన, ఒత్తిడితో కూడిన ఆలోచనల వల్ల సెక్స్‌పర్‌ఫార్మెన్స్ సరిగ్గా చేయలేరు. క్రమంగా తగ్గుతుంది. దీంతో భార్యాభర్తలిద్దరిలో అసంతృప్తి పెరుగుతుంది. మనస్పర్థలు మొదలవుతాయి. గొడవలకు దారితీసి ఒక్కోసారి విడాకుల వరకు వెళ్లే అవకాశముంది. భార్యాభర్తలిద్దరూ ఒత్తిడితో సతమతమవుతుంటే ఇంట్లో ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొనదు. ఇంటికి వచ్చాక పిల్లలతో గడిపే సమయం ఉండదు. తమతో గడపాలని పిల్లలు కోరుకుంటారు. స్కూల్లో జరిగిన సంఘటనలు, ఇతర విశేషాలు తల్లిదండ్రులతో పంచుకోవాలని అనుకుంటారు. బాధలు చెప్పుకుంటే తల్లిదండ్రులిచ్చే సలహాలు, పరిష్కారాల కోసం ఎదురుచూస్తారు. కానీ ముఖ్యంగా ఆ సమయం దొరకడం అరుదైంది. దీంతో తమ సమస్యలను తల్లిదండ్రులతో కాక బయటి వ్యక్తులతో పంచుకోవడం పెరుగుతోంది. ఈ క్రమంలో అనుకోకుండా వారి ప్రభావం అధికమవుతుంది. అక్కడ వారికి అక్కర్లేని సహాయం దొరకుతోంది. ఇంట్లో అన్ని సౌకర్యాలు ఉన్నా 'బయటివారి చేతుల్లోకి' వెళ్లిపోతున్నారు. ముఖ్యంగా అమ్మాయిలు.... తల్లిదండ్రుల ప్రేమను కాదని, ఎవరో తెలియని వ్యక్తితో ప్రేమలో పడడానికి ఇదే కారణం. ఎవరి ఒత్తిడిలో వారు ఉండిపోవడం, గంటలకొద్దీ ఆఫీసులో గడపడంతో ఈ సమస్య ఉత్పన్నమవుతుంది. ఇదేకాక పిల్లల్లో కూడా మానసిక సమస్యలు వచ్చే అవకాశముంది. మానసిక వైద్య పరిభాషలో తల్లిదండ్రులను యాంటిడిప్రెసెంట్

అనిఅంటారు. అంటే అమ్మానాన్నలు ఔషధం లాంటివారు. తమకు ఏదైనా సమస్య వస్తే తల్లిదండ్రులకు చెబితే ఉపశమనం కలుగుతుందని పిల్లలు ఆశిస్తారు. వారి మనోవేదనకు రిలీఫ్ కలుగుతుంది. ఇది లేనప్పుడు పిల్లల్లో యాంగ్జైటీ, డిప్రెషన్, ఫోబియా ఇతర మానసిక సమస్యలు వస్తాయి.

చికిత్స

ఒత్తిడికి చేసే వైద్యం మూడు రకాలుగా ఉంటుంది. మైల్డ్, మాడరేట్, సివియర్. మైల్డ్ అంటే కొద్దిగా బెంగ, డల్, ఏకాగ్రత తగ్గడం దీని లక్షణాలు. రిలాక్సేషన్, ప్రాణాయామం, యోగ, మెడిటేషన్‌తో దీన్ని తగ్గించుకోవచ్చు. ఇంక మోడరేట్, సివియర్ సంగతి చూద్దాం. ఇదివరకు ఉన్న ఆసక్తి తగ్గడం, అన్నం తినకపోవడం, నిద్ర పట్టకపోవడం, జీవితం గురించి వేదాంత ధోరణిలో ఆలోచించడం, ఎందుకు పనికిరాను, గమ్యం లేదు అనే భావనలో ఉండడం. ఈ సమయంలో ప్రాణాయామం, యోగ చేయాలి. నిపుణులైన మానసిక వైద్యనిపుణులను సంప్రదించాలి. వీరు మీ జీవనశైలి విధానంలో, ఆలోచన విధానంలో ఎలాంటి తప్పులున్నాయో గుర్తిస్తారు. వాటిని ఎలా సరిదిద్దుకోవాలో చూస్తారు. దీన్నే సైకోథెరపీ అంటారు. ఇది చాలా బాగా పనిచేస్తుంది. కాని టైం పడుతుంది. ఒత్తిడిలో ఉన్న వ్యక్తి అనుభవించే క్షోభ ఆ వ్యక్తికి మాత్రమే తెలుసు. తొందరగా ఒత్తిడి నుంచి బయటపడాలని చూస్తాడు. అలాంటి వ్యక్తికి కౌన్సిలింగ్, మందులతో వైద్యంచేస్తారు. ఫ్రెష్‌నెస్ కనిపిస్తుంది. ఆలోచించే విధానంలో మార్పులు వస్తాయి. ఆకలి పుడుతుంది. నిద్ర పడుతుంది. కాకపోతే మందులు జీవితాంతం వాడాలనేది తప్పుడు అభిప్రాయం. సరైన సమయంలో వైద్యం తీసుకుంటే ఒత్తిడి నుంచి బయటపడొచ్చు.

నివారణ మార్గాలు

- చేస్తున్న పనిని ఆర్గనైజ్ చేసుకోవాలి. కొన్ని పనులను ప్రశాంతంగా చేసుకోవచ్చు. చాలా మందిలో ఒత్తిడితో ఉన్నవారికి ఏ పనికి ప్రాధాన్యత ఇవ్వాలి, దేనికి ఇవ్వకూడదో మరచిపోతారు. దీని వల్ల గజిబిజిగా ఉంటుంది. స్పష్టత ఉండదు. కచ్చితంగా, టైం ప్రకారం చేయాల్సిన పని వాయిదా పడుతుంది. దీంతో పనులు పూర్తికాక ఒత్తిడి మరింత పెరుగుతుంది. ఒత్తిడి బాగా తగ్గించాలంటే పద్ధతి ప్రకారం పనిచేయాలి.
- ఒక పని తర్వాత రెండు గంటలు బ్రేక్ తీసుకోవడం ముఖ్యం. అంటే రిలాక్స్ అవ్వడం. పని పూర్తయ్యాక రోజులో రెండు గంటలు ఏ పని పెట్టుకోకుండా సేదతీరాలి. విశ్రాంతి తీసుకోవాలి. కుటుంబ సభ్యులతో గడపాలి. అవసరమైతే సెల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్ చేయాలి. ఏ పనులు పెట్టుకోకూడదు. ఈ విధంగా మైండ్‌సెటప్ చేసుకోవడం వల్ల ప్రశాంతంగా ఉంటారు. మరుసటి రోజు హుషారుగా ఉంటారు. పనిలో నాణ్యత కనిపిస్తుంది. 8 గంటల పనితర్వాత కచ్చితంగా బ్రేక్ తీసుకోవాలి.
- రెండు, మూడు గంటలు పనిచేసాక సిగరెట్, టీ తాగడం కొంత మందికి అలవాటు. దీని వల్ల తాత్కాలికంగా విశ్రాంతిగా అనిపించినా తెలియకుండానే దీనికి బానిసవుతారు. ప్రతీసారి టీ, సిగరెట్ తాగే అలవాటు పెరుగుతుంది. టీ లోని కెఫిన్ అలవాటుగా మారుతుంది. ఇది అందని సమయంలో చేతులు, కాళ్లు వణకడం, ఒక చోట నిలబడలేకపోవడం, ఆకలి మందగించడం, వంటివి బోనస్‌గా లభిస్తాయి. టీకు బదులుగా మధ్యలో లెమన్ జ్యూస్ చల్లటి మంచి నీళ్లు తాగితే మంచిది.
- పనిలో రెండు గంటలకోసారి బ్రేక్ తీసుకుని ఒక చోట రిలాక్స్‌గా కూర్చుని ప్రాణాయామం చేయడం వల్ల ఉపశమనం కలుగుతుంది. పని చేస్తున్నప్పుడు ఆలోచించి ఆలోచించి మెదడులో ఆక్సిజన్ శాతం తగ్గుతుంది. దీని వల్ల ఒత్తిడిని తగ్గించుకునే శక్తి సన్నగిల్లుతుంది. ప్రాణాయామం వల్ల మెదడుకు ఆక్సిజన్ అంది చరుకుగా మారతారు. రెట్టింపు శక్తి వస్తుంది. అనుకున్న సమయానికి ముందుగానే ఆ రోజు పని పూర్తవుతుంది.
- సెలవు రోజు ఉల్లాసంగా గడపాలి. పిల్లలు, కుటుంబ సభ్యులే మిమ్మల్ని అర్థం చేసుకుంటారు. వారితో రోజూ అరగంట, నలభై నిమిషాలు నవ్వుతూ ఉల్లాసంగా గడపండి చాలు. ఒత్తిడి బాగా తగ్గుతుంది. కుటుంబసభ్యులంతా కలిసి భోజనం చేయండి. కబుర్లు చెప్పుకోండి. ఈ సమయంలో టీవీని ఆఫ్ చేయండి.
- ఒత్తిడికి సబంధించి డైరీ రాయాలి. రోజులో ఎటువంటి ఆలోచనల వల్ల, ఏ సమయంలో ఒత్తిడి పెరిగిందో డైరీలో రాసుకోవాలి. వారాంతానికి డైరీ చూస్తే ఒత్తిడికి కారణాలు తెలుస్తాయి. వీటిని అధిగమించడానికి ప్రయత్నించండి. వచ్చే వారం ఇలాంటి వాటివల్ల బాధపడకూడదని మీరే అనుకుంటారు. ఒక వేళ సమస్య పెద్దదైతే వాటికి పరిష్కార మార్గాలను భార్య, బంధువులు, స్నేహితులను అడిగి చూడండి. ఒక్కోసారి ఒత్తిడి వల్ల ఇతరుల సహాయాన్ని కోరడం కూడా మరచిపోతారు. సహాయం అడగడం సిగ్గుగా భావిస్తారు. ఒత్తిడి వల్ల మెదడు తెలిసిన విషయాలు మరచిపోతుంది. ★

వాళ్లు

అలుపు ఎరగని
ఆలుమగలు
వలపు ఎరగని
అర్ధనారీశ్వరులు!
కైలాసగిరిపైన
నాట్యమాడబోరు
పోడు భూముల్లోన
శ్రమశక్తి ఒలికించి
విత్తనం పోస్తారు
ఆరు గాలాల్లోనూ
పస్తులుంటారు!
ఏ పూట కూడా...
తమ సుఖాల కోసం
పలకరించుకోరు
ఎర మింగిన చేపల్లా
ఫైనాన్స్ గాలాలకు
చిక్కి శల్యమౌతుంటారు!
కష్టాలు కన్నీళ్లు
కావడి కుండల్లా మోస్తారు
కార్పొరేట్ స్కూళ్లలో
పిల్లల్ని చదివిస్తుంటారు!
పునాస పంటంతా
ఫీజుల కిందే చెల్లిస్తారు
బంగారు భవిష్యత్తుకు శాశ్వత
పునాదులు వేస్తున్నామని
కలలు కంటుంటారు!
పిల్లల కోసమే వాళ్ల ఆరాటం!
భూమితోనే వాళ్ల పోరాటం!!

- రావుల పుల్లాచారి

రహస్యం



కొండల బండల సుత్తుల కొట్టి
కంకరగా పాలిష్ రాళ్లు
తయారు చేసేది కార్మికుడే

మట్టిని మెత్తగ చేసి
అచ్చుతో ఇటుకలు చేసి
తీరు తీరుగ బట్టీల్లో పెట్టి
బంగరు రంగుకై నిప్పున కాల్చి
ఇటుకలు చేసేది కార్మికుడే

చెట్లను మొద్దులాగా
తీరుతీరు చెక్కలు పట్టీలుగా
రంపం, ఉలి, బాడిసెలతో
సుందర గుమ్మాలను
కిటికీలను తయారు
చేసి ఇళ్లకు అందం కూర్చేదీ కార్మికుడే

చచ్చిన ఎద్దుల దున్నల
చర్మం చిరుకత్తులతో
నేర్పుగ వలిచి ఉప్పున ఊరబెట్టి
పట్టెళ్లు పాదరక్షలుగా జనాల కందించేది కార్మికుడే

చేలను ఇరువాలుగ
ముప్పాలుగ నాగట
దంతెల దున్ని, ఎరువును
ఎరగా వేసి, పంటలతో
ఆహారం అందించేది కార్మిక కర్షకులే!

గనులను తవ్వి బొగ్గు ఆయిల్ గ్యాస్
ప్రజలకు అందించేదీ కార్మికుడే!
ఇటికలతో సిమెంట్ ఇసుక
పాళంగా చేసి
భవనాలను నిర్మించేదీ కార్మికుడే

ఇన్ని పనులను ప్రజలకు సేవగ అందించే
ఈ కార్మికులకు నివాసం కర్రల గుడిసెలు
కట్ట బట్ట, పోషక ఆహారం సున్న
ఈ ఫలాలన్నీ ఎటు పోతున్నాయి?
అసలు రహస్యం కార్మికుడు గుర్తిస్తే
తమ శ్రమ ఫలాల కొరకు
తెగింపుతో నిలబడితే
పరాన్న భుక్కులు పరార్, పరార్

- రామిశెట్టి రోశయ్య

కవిత్వమ్

బురిడీ బాబాలు..

బాబాలు స్వాములు అమ్మలంటూ
భక్తులపై మాయోపాయాలు
ప్రశాంత వదనాలతో
మోసాలే అసలు ధ్యేయాలు
అవతారమూర్తులంటూ
చేసేది అడ్డగోలు వ్యవహారాలు
తెర వెనుక స్నేహాలతో
అచ్చమైన నల్లడబ్బు దోస్తానాలు
మ్యాజిక్కులు జిమ్మిక్కులతో
బురిడీలు కొట్టించడమే లక్ష్యాలు
ప్రజాప్రతినిధులు పరిశ్రమాధిపతులు
బాబాల స్విస్‌బ్యాంక్ డిపాజిటర్లు
సర్వసంగ సన్యాసులంటూ
సాగించేది అశ్లీల కార్యకలాపాలు
మౌనంగా ముక్కు మూసుకుంటూ
నడుపుతారు సమాంతర ప్రభుత్వాలు
ఆర్థిక అంతరాలు తొలిగేవరకూ
వీరు పుడుతూనే ఉంటారు

- శాంతిశ్రీ

ఓట్ల పంటలం....

తుమ్మితే ఊడిపోయే
ముక్కులాంటోల్లం
ఉంటేనేం ఊడితేనేం
పూటపూటకీ
పొయ్యికిందకీ మీదకీ
ఏటి పెట్టాలో
వెతుక్కునే వోల్లం
ఏమీ లేనోల్లం గరీబోల్లం
చెట్టుకిందో గట్టుపక్కో
రోడ్డున పడ్డవాల్లం
పోలీసోల్ల లాటీలు
వొంటి మీద విరుచుకున్నోల్లం
సర్కారోల్ల ఛీఛీ పోపోల
చీత్కారోల్లం
ఉంటేనేం ఊడితేనేం

కానీ మీక్కావల్సినప్పడు మాత్రం
ఓట్ల పంటలయ్యే వోల్లం
మీ కుర్చీ పట్టుకోసం
చీమల పుట్టలయ్యేవోల్లం
జెండాలై జేజేలై బేనర్లయ్యేవోల్లం
అందుకేనేమో
చావకుండా
బతక్కుండా ఇలా....

- బద్ది నాగేశ్వరరావు



నవ్వుల్ - పువ్వుల్

రుమాళ్లు

దర్శకుడు : మన సినిమా రిలీజు రోజున మార్నింగ్‌షో కి కర్చీపులు పంచిపెడితే బావుంటుంది సార్!

నిర్మాత : ఎందుకు?

దర్శకుడు : అడుగడుగున కంట తడిపెట్టించే దృశ్యాలు మన సిన్మాలో చాలా వున్నాయి కదా.

రాశిఫలాలు

భార్య : ఏవండీ! త్వరలో నేను టీవీ సీరియల్ రచయిత్రినయ్యే అవకాశం ఉందని ఈ సంవత్సరం రాశిఫలాల్లో ఉందండీ.

భర్త : బట్టలు ఉతకడం, వంటావార్పూ, అంట్లు తోమడం నేర్చుకుంటానని నా రాశి ఫలాల్లో వుంటే ఏంటో అనుకున్నా. అదన్నమాట సంగతి!

చిట్కా

పేషెంట్ : సిస్టర్! నాకు ఎంత ప్రయత్నించినా నిద్ర రావడం లేదు.

సిస్టర్ : అందుకు నేనేం చెయ్యాలి?

పేషెంట్ : ఏదైనా సిన్మాలో జోలపాట పాడండి ప్లీజ్.

రూపాయి హోటల్

సప్లయర్ : సార్! మీరు చాలాకాలం నుండి మా హోటల్‌కు వస్తున్నారు. మా హోటల్ మీద మీ అభిప్రాయం ఏంటి?

కస్టమర్ : మీ హోటల్‌లో ఎక్కడా లేని విధంగా ఒక రూపాయికి ఇడ్లీ, ఒక రూపాయికి దోసె, ఒక రూపాయికి పూరీ, ఒక రూపాయికి టీ, కాఫీ ఇస్తారు. కానీ మురుగు కాల్వ పక్కన ఉండడం వల్ల ఎప్పుడు ఏరోగం వస్తుందోనని నాభయం.

సప్లయర్ : మీరేం కంగారు పడకండి సార్. ఆ రోగాలు కూడా ఒక రూపాయికే వస్తాయి.

జె. సుధాకర్ పట్నాయక్, కాకినాడ.

2011 ఇంటర్ ఫలితాలలో "శ్రీ సాయి చైతన్య" కాలేజి సంచలనం. జిల్లాలో ప్రథమస్థానం "శ్రీ సాయి చైతన్యదే"

1st Bi.P.C

వై.మనీష 973/1000
H.T.No.1112214590

ఇటు M.P.C లోనూ, అటు Bi.P.C లోనూ ఇప్పటికీ ఎప్పటికీ అగ్రస్థానంలో మేమే

కడపజిల్లా ఫస్ట్ మార్క్సు

వి.శ్రీనివాసులు రెడ్డి 972/1000
H.T.No.1112211280

పి.మణికంఠేశ్వర్ 968/1000
H.T.No.1112212508

పి.లోకేష్ 967/1000
H.T.No.1112214981

ఓ.ఇంద్రాని, 964/1000 H.T.No.1109229378
పి.శ్రావ్య, 958/1000 H.T.No.1112213543
ఎస్.లలిత్‌కుమార్, 961/1000 H.T.No.1109229882
కె.లక్ష్మీప్రభ, 954/1000 H.T.No.1109228240
ఎల్.విజయ్‌కుమార్, 960/1000 H.T.No.1109229779
బి.కార్తీక్, 951/1000 H.T.No.1109228250

900 పైగా మార్కులు సాధించిన మా విద్యార్థులు : 70 మంది
ఉత్తీర్ణత శాతం : 96%

అడ్మిషన్లు జరుగుచున్నవి

వివరాలకు సంప్రదించండి

శ్రీ సాయిచైతన్య జూనియర్ కాలేజి (కడప బ్రాంచి)

Opp : హిమాలయ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, యర్రముక్కపల్లె సర్కిల్, ద్వారకానగర్, కడప.

Cell :94407 68921, 8801386509.

సినిమా కబుర్లు

కొన్నేళ్ల కిందటి మాట- అమితాబ్ బచన్ అడ్వర్టయిజ్‌మెంట్లలో నటించాలని నిర్ణయించుకున్నప్పుడు అది కొద్ది రోజుల పాటు వార్తా విశేషంగా చలామణి అయింది. ఒకసారి ఆ వరవడి అర్ధమైన తర్వాత ఆయన మరీ సాధారణమైన యాడ్స్‌లోనూ కనిపిస్తున్నాడేమిటా అనే వ్యాఖ్యలూ వినిపించాయి. నెమ్మదిగా దానికి కూడా అలవాటు పడి ఇప్పుడు ఏ యాడ్‌లోనైనా ఆయనను చూడటానికి ప్రేక్షకులు సిద్ధమైపోయారు. ఆయన కుమారుడు అభిషేక్ బచన్ చాలా చిత్రాల్లో నటించినా విజయాల శాతం తక్కువే కావడంతో బాగా చిన్న వయసులోనే యాడ్స్ బాట పట్టాడు. 'వాట్ యాన్ ఐడియా....' యాడ్స్‌లోనే ఆయన ప్రజలకు బాగా దగ్గరైనాడని చెప్పొచ్చు. ఇందుకు ఆయన తీసుకున్న పారితోషికం ఎంతో తెలియదు గాని ఆ విధంగా చూస్తే బాగా గిట్టుబాటయినట్టే.

యాడ్స్ కూడా గ్లామర్‌కు యాడ్?

చాలా చాలా ఏళ్ల కిందటనైతే రిటైర్డు నటీనటులు మాత్రమే యాడ్స్‌లో కనిపిస్తుండేవాళ్లు. అప్పట్లో ఇంకా బుల్లి తెర ప్రధాన ప్రచారాయుధంగా లేని రోజులవి. లక్స్ సబ్బు సినీతారలు వాడతారంటూ ఎప్పటికప్పుడు వారి సంతకాలతో యాడ్స్ వస్తుండేవి. అలాగే గ్వాలియర్ సూటింగ్స్‌కు షర్మిలా ఠాగూరు పటౌడి నవాబ్ జంట కనిపిస్తుండేది. అవకాశాలు తగ్గిన సీనియర్లు ఇంకా వెతుక్కుంటున్న జూనియర్లు మాత్రమే యాడ్స్‌లో వుంటారనేది సర్వ సాధారణ సూత్రం మొదట్లో. కాని అమితాబ్ అంతటి మిలీనియం నట శిఖరం వచ్చాక అదంతా మారిపోయింది. షమ్మి కపూర్, అనుపమ్ ఖేర్, వంటివారికి పరిమితమైన యాడ్ ప్రపంచంలో షారుఖ్, సల్మాన్, అమీర్, అక్షయ్, వంటివారంతా వచ్చేశారు. ఆ యాడ్స్‌లోనూ వారి వారి ప్రత్యేకతలకు తగినట్టు రూప కల్పన చేసి వినియోగదారులను ఆకట్టుకునే ప్రయత్నం జరిగింది.

ఇప్పుడు చూస్తే కాస్త వెగటుగా అనిపించే యాడ్స్‌లో కూడా కనిపించడానికి గ్లామర్ తారలు కూడా వెనుకాడటం లేదు. దీపం వుండగానే 'ఇల్లు' చక్కబెట్టుకోవాలన్న తెలివితేటలు వారికి బాగా ఎక్కువైపోయాయి. కాగా మరికొందరు అసహాయంగా తక్కువ రకం యాడ్స్‌లో కనిపిస్తూ కాలక్షేపం చేస్తున్నారు. ఉదాహరణకు పదిహేనేళ్ల కిందట "ముస్తఫా ముస్తఫా" అంటూ యువతను వుర్రూతలూపిన అబ్బాస్ ఇప్పుడు ఏ యాడ్‌లో నటిస్తున్నాడో గుర్తు చేసుకోండి! అదేం తప్పని, తక్కువనీ కాదు గాని వాస్తవానికి కల్పనకూ వున్న తేడా తెలుసుకోవడానికి మాత్రం బాగా వుపయోగపడుతుంది.

ఇప్పుడు టాలీవుడ్‌కు వస్తే నిన్నటి అగ్రహీరోలెవరూ యాడ్స్‌లో కనిపించిన దాఖలాలు లేవు. అంటే ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, శోభన్‌బాబు.... బాగా వెలుగొందుతున్నప్పటి కాలంలో. వయస్సు పైబడ్డాక అక్కినేని ఒకటి రెండు ఉత్పత్తులకు తోడ్పాటునందించే ప్రయత్నం చేశారు గాని ఇప్పటి వరకూ యాడ్స్‌లో పాల్గొన్నది పెద్దగా లేదనే చెప్పాలి. చిరంజీవి కూల్‌డ్రింకు అంబాసిడర్‌గా మారడంతో ఆ అధ్యాయం మొదలైంది. అప్పుడే వాటిపై జన విజ్ఞాన వేదిక పోరాటం మొదలెట్టింది. చిరంజీవి స్వయంగా ఆ బాట్లింగ్ ప్లాంట్ దగ్గర నిలబడి ప్రమాదం లేదని సమర్థించడం పెద్ద వార్తయింది. సరే తర్వాత ఆయన తమ్ముడు పవన్ కళ్యాణ్, ఆ తర్వాత మేనల్లుడు అల్లు అర్జున్, రామ్‌చరణ్ తేజ్ ఇలా ఆ కుటుంబ నట సభ్యులందరూ ఏదో ఒక శీతల పానీయ దూతలుగా దర్శనమిస్తూనే వున్నారు.

ఈ తెలుగు యాడ్ల పర్వంలో తాజాగా బంగారు వేట మొదలైంది. అక్కినేని నాగార్జున కళ్యాణి జ్యూయలర్స్ తరపున పెద్ద ఎత్తున యాడ్స్‌లో ప్రత్యక్షమైనారు. హైదరాబాదు నేపథ్యంలో ఆ బంగారు ఆభరణాల గురించి ఆయన చెప్పడం కొత్త ఆకర్షణగా మారింది. బంగారానికి సంబంధించి ఇతర చోట్ల లేని విశేషాలేవో వాటికి వున్నాయని, రేట్లు వాటిపైనే వుంటాయని ప్రతిదీ గొప్పగా ప్రచారమైంది. ఇటీవలి కాలంలో ఉదారంగా నటిస్తూ కనిపిస్తున్న జగపతి బాబు మరో బ్రాండ్ బంగారానికి ప్రచారకుడుగా వచ్చారు. ఇంతలోనే జూనియర్ ఎన్టీఆర్ తన పెళ్లి వేడుకల కొనసాగింపు అనిపించే రీతిలో మలబార్ యాడ్స్ చేపట్టారు. చివరగా మహేష్ బాబు జోస్ అలూకాస్ బ్రాండ్ కోసం మరింత అందమైన మేకప్‌లో యాడ్ మాన్‌గా హోర్డింగులనలంకరించారు. అంతకు ముందు ఆయన కూడా థమ్సప్ దూతగా చాలా చాలా సాహసాలు చేసి అలరిస్తూనే వున్నారు. అన్నట్టు వెంకటేష్ మణప్పురం గోల్డ్‌లోన్ దూతగా తొలి డబుల్ యాక్షన్ యాడ్ చేసి పెట్టారు. ఎస్పి బాలసుబ్రహ్మణ్యం, ప్రకాశ్ రాజ్, కె.విశ్వనాథ్ వంటివారు పెద్దరికపు యాడ్లలో వస్తూనే వున్నారనుకోండి. ఇదే సమయంలో వీరిలో చాలా మంది టీవీ ఎపిసోడ్స్‌లోనూ నటిస్తూ నిర్వహిస్తూ ఆదాయం సమకూర్చుకుంటున్నారు.

నటీమణుల విషయానికి వస్తే ఆసిన్, త్రిష, జెనీలియా, ఛార్మి, స్నేహ, శ్రియ వంటి వారెందరో రకరకాల యాడ్స్‌కు వన్నె చేకూరుస్తున్నారు. యాడ్స్ ద్వారానే గుర్తింపు పొంది నాయికలైన వారు కూడా వీరిలో చాలా మంది వున్నారు. సీనియర్ నటీమణులయితే ఆ తరహా యాడ్స్‌లోనే కనిపించి అరక్షణంలోనే అభినయం కురిపించేస్తుంటారు. సౌందర్య సాధనాలకు ఒక తరం నటీమణులైతే వంటింటి సామగ్రికి మరో తరం తారలు కనిపిస్తారు.ఇదే గాక ప్రారంభోత్సవాలకు పారితోషికంపై రావడానికి ఒప్పుకున్న తారామణులు వాటి తాలూకూ యాడ్స్‌లోనూ ముద్రితమవుతుంటారు. సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌కు జెనీలియా చేసిన యాడ్ అలాటి వాటిలో ఒకటి. కళాంజలికి దీపికా పదుకునే అనేక భంగిమలు సమకూర్చిపెట్టింది. చందన... బొమ్మన వంటి వస్త్ర సంస్థలతో మొదలైన ఈ ధోరణి ఇప్పుడు బాగా పెరిగిపోతున్నట్టు అర్ధమవుతుంది.

మొత్తంపైన తెలుగునాట ఇప్పుడు గ్లామర్ తారల యాడ్స్ ఎక్కువగా వస్త్రాలు ఆభరణాలకోసం వస్తున్నాయని చెప్పొచ్చు. గతంతో పోలిస్తే ఎంతటి నటీ నటులకైనా చిత్రాల సంఖ్య తక్కువగానే వుంటుంది గనక అందమైన యాడ్స్‌లో కనిపిస్తే ప్రచారంతో పాటు బాగా పారితోషికమూ లభిస్తుంది గనక తారలు అందుకు సిద్ధమైపోతున్నారు. పెరుగుతున్న వినియోగ సంస్కృతిలో ప్రచారంపై మరింత ఖర్చు పెట్టడానికి సిద్ధమవడం పెద్ద ఆశ్చర్యమేమీ కాదు. ఎందుకంటే ఈ గ్లామర్ మళ్లీ సినిమాలకు తోడవుతుంది కదా! ప్రపంచీకరణ సంస్కృతిలో మనిషికన్నా వస్తువుకు విలువ ఎక్కువతౌతుందన్నది సాధారణంగా వినిపించే మాట. పేరు ప్రఖ్యాతులున్న తారాలోకం సహితం ఆ సూత్రాన్నే అనుసరించడం ఇక్కడ కొసమెరుపు.

- పీపీ

గ్రీన్ రసం

కావలసిన పదార్థాలు

చుక్కకూర - 1 కట్ట, పాలకూర - 1కట్ట
క్యారెట్ - 1, బీట్‌రూట్ -1
కందిపప్పు - 2 టేబుల్ స్పూన్లు
టమాటాలు - 4, చింతపండు - గోలీసైజంత
పచ్చిమిర్చి - 2, ఎండుమిర్చి - 2
కరివేపాకు - 2 రెమ్మలు, ధనియాల పొడి - 2 టీస్పూన్లు, జీలకర్ర - 2 టీస్పూన్లు

తయారు చేసే విధానం

అన్ని ఆకు కూరలను కడిగి పెద్ద ముక్కలు కోసుకోవాలి. కందిపప్పు, బీట్ రూట్, క్యారెట్ ముక్కలు, టమాటాలు గిన్నెలో వేసి కొద్దిగా నీళ్లు పోసి కుక్కర్‌లో పెట్టి 3 విజిల్స్ వచ్చేవరకు వుంచాలి. చల్లారిన తర్వాత మెత్తగా మెదుపుకోవాలి. చింతపండు రసంతీసి పెట్టుకోవాలి. బాండీలో నూనె వేసి కాగనివ్వాలి. అందులో ఎండుమిర్చి, వెల్లుల్లి ముక్కలు, తాలింపు గింజలు, కరివేపాకు, చింతపండు రసం, ఉప్పు, మెత్తగా మెదుపుకున్న ఆకుకూరలు వేసి కొద్దిగా నీళ్ల పోసి ఐదు నిమిషాలు కాగనివ్వాలి. అంతే ఘుమఘుమలాడే గ్రీన్ రసం రెడీ!





దద్ధోజనం

కావలసిన పదార్థాలు

బియ్యం - పావుకిలో, పెరుగు- 3 కప్పులు
పాలు- అరలీటరు, అల్లం- కొంచెం
పచ్చిమిర్చి- 4, నెయ్యి - ఒక టేబుల్ స్పూను
కరివేపాకు- రెండు రెబ్బలు
ఉప్పు- చాలినంత, జీలకర్ర- కొంచెం
మినప్పప్పు- ఒక టేబుల్ స్పూన్
ఆవాలు- ఒక టీ స్పూను, ఎండుమిర్చి- 4

తయారు చేసే పద్ధతి

పాలు మరగించి చల్లార్చి వుంచుకోవాలి. బియ్యం శుభ్రంగా కడిగి అన్నం కొద్దిగా మెత్తగా వండాలి. అన్నం వుడికిన తర్వాత గరిటెతో బాగా మెదుపుకోవాలి. దీనికి పాలు (చల్లార్చినవి), పెరుగు కలపాలి. ఒక మూకుడులో నెయ్యిపోసి మినప్పప్పు, పచ్చిమిర్చి, అల్లం ముక్కలు, జీలకర్ర, ఆవాలు, కరివేపాకు వేయించి ఈ పోపు పెట్టుకోవాలి. దీన్ని పాలు, పెరుగు కలిపిన అన్నంలో వేసి తిప్పాలి.

పప్పుల పొడి

కావలసిన పదార్థాలు

కందిపప్పు -1 కప్పు
ఎండుమిర్చి - 1 కప్పు
పెసరపప్పు- 1 కప్పు, వెల్లుల్లి - 10 రెబ్బలు
శనగపప్పు - 1 కప్పు, జీలకర్ర -1/2 కప్పు
మినప పప్పు - 1 కప్పు, ఉప్పు - సరిపడా

తయారు చేసే పద్ధతి

మిరపకాయలు వేయించి పక్కన పెట్టుకోవాలి. కందిపప్పు, పెసరపప్పు దోరగా వేయించుకోవాలి. వీటన్నింటినీ కలిపి మిక్సీ వేసుకోవాలి. చివరిగా ఉప్పు, వెల్లుల్లి కూడా వేసి మెత్తగా పొడి చేసి సీసాలో పోసుకోవాలి. ఈ పొడి అన్నంలోకి, ఇడ్లీలోకి కూడా బాగుంటుంది.



కరివేపాకు కారం

కావలసిన పదార్థాలు

కరివేపాకు ఆకులు - 2 కప్పులు
ఎండుమిర్చి - 1 కప్పు, ధనియాలు- అరకప్పు
వెల్లుల్లి - 10 రెబ్బలు
చింతపండు-చిన్న నిమ్మకాయంత
నూనె-2 టీ స్పూన్లు, జీలకర్ర - 2 టీ స్పూన్లు
ఉప్పు - సరిపడా

తయారు చేసే పద్ధతి

కరివేపాకు ఆకులను కడిగి తడి లేకుండా ఆరబెట్టాలి. తర్వాత వేయించి పక్కన పెట్టుకోవాలి. బాండీలో ధనియాలు, జీలకర్ర వేటికవే వేయించి పక్కన పెట్టుకోవాలి. అదే బాండీలో కొద్దిగా నూనె వేసి ఎండుమిర్చి వేయించుకోవాలి. వెల్లుల్లిపాయ, చింతపండు, సరిపడా ఉప్పువేసి మెత్తగా దంచి సీసాలో పోసి పెట్టుకోవాలి. ఈ పొడి చాలా రుచిగా ఉంటుంది. పైగా ఆరోగ్యానికి కూడా మంచిది అంటారు.



చిప్స్

కావలసిన పదార్థాలు

బంగాళ దుంపలు- పావుకిలో
ఉప్పు- 1 టేబుల్ స్పూన్
కారం- 1 టేబుల్ స్పూన్
నూనె- పావుకిలో
అల్లం- కొంచెం

తయారు చేసే పద్ధతి

బంగాళదుంపల్ని సన్నగా, పల్చగా తరిగిపెట్టుకోవాలి (ఒకేసైజు బంగాళదుంపలైతే చిప్స్ చేయడానికి బాగుంటాయి). మరుగుతున్న నీటిలో అల్లం, పచ్చిమిర్చి పేస్టు, ఉప్పు, కారం వేయాలి. అందులో సన్నగా కోసుకున్న బంగాళదుంప ముక్కల్ని వేసి ఒక నిమిషం ఉంచి తీసి ఎండబెట్టాలి. ఇలా రెండుమూడు రోజులు బాగా ఎండిన తర్వాత డబ్బాలో పోసుకుని నిల్వ ఉంచుకోవచ్చు. చిప్స్ ఎంతకాలమైనా నిల్వవుంటాయి. వేయించుకోవాలనుకున్నప్పుడు మూకుడులో నూనె వేసి మరిగించాలి. అందులో వీటిని వేసి బంగారు రంగు వచ్చేదాకా వే[illegible]. బంగాళదుంపలతోనే కాకుండా అర[illegible] కూడా చేసుకోవచ్చు.



"విద్య ఉన్న మనను విజయము వరియించు, విద్య సత్యమైన వినయ మబ్బు, చదువురాని వాడు కదలని శిలయౌను, విజయు పలుకు వినుడు సుజనులారా"

"ఉప్పు అమ్మి బడిన ఓం నమః నేర్చాను. తోడు నిలిచి నాకు త్రోవ సూపె! గురువులకను మదిలో గుర్తుగా గుడి కట్టి మరువలేను గతులు మారుగాక!!

"బడికి పోనివారు బలహీనులవుతారు..బుద్ధి లేని వాడు శుద్ధ మొద్దు! విద్య లేని వాడు వింత జంతువగును..చదువులున్న భవిత కొదవ లేదు!!

ఈ పద్యాలు రాసింది..ఏ కవో..రచయితో..లేక అధ్యాపకుడో, తెలుగు సంపాదకుడో అనుకుంటే పొరపాటే. జీవితం గురించి అంతగా తెలియని ... మంచేదో చెడేదో నేర్చుకుంటున్న తొలిప్రాయంలో.... బాల్యం నుంచి భవితవ్యంవైపు అడుగిడుతున్న తొమ్మిదో తరగతి విద్యార్థి బట్టు విజయ్‌కుమార్. ఆ చిన్నారి రచించిన 'అడవి పూసిన వెన్నెల' పుస్తకంలోనివే ఈ పద్యాలు. సహజంగా తొమ్మిదో తరగతి విద్యార్థి అంటే అల్లరి చిల్లరగా తిరుగుతూ షికార్లు కొట్టే వాళ్లనే మనం చూశాం. ఆ వయసులో సెల్‌ఫోన్ కావాలని, సినిమాలు చూడాలని, వీడియో గేమ్స్ కావాలని మారాం చేసేవాళ్లే ఎక్కువగా ఉంటారు. విజయ్ ఆ దిశలో పయనించలేదు. కష్టపడి చదువుతూ చిన్న చిన్న కవితలు రాసుకుంటూ, మెల్ల మెల్లగా పద్యాలను రచించడం మొదలెట్టాడు. ఇప్పటికి 100కు పైగా పద్యాలు రాశాడు. వాటి సంకలనమే 'అడవి పూసిన వెన్నెల'. ఈ పుస్తకాన్ని ప్రభుత్వ గురుకుల కళాశాల కార్యదర్శి చేతుల మీదుగా ఆవిష్కరింపజేశాడు...


విజయ్‌కుమార్

ఆ బాలుడు
అడవిలో పూసిన వెన్నెలే...

అడవి పూసిన వెన్నెల రచయిత విజయ్‌కుమార్ అడవిలోనే పుట్టాడు. ప్రకృతి ఒడిలో వికసించాడు. కరీంనగర్ జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని మారుమూల అటవీ ప్రాంతమైన వీర్నపల్లి గ్రామంలోని బావుసింగ్ తండా నివాసి. బట్టు హరిచంద్, మంగవ్వకు మొదటి సంతానం. వయస్సు 14 సంవత్సరాలు. హరిచంద్ నిజామాబాద్ జిల్లా సిరికొండ వాసి. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి తన అక్క, బావ గ్రామమైన వీర్నపల్లిలో పెరిగాడు. పశువులను మేపుకుంటూ జీవించే హరిచంద్ వివాహం కాగానే ఓ గుడిసె కట్టుకుని తాటి ముంజలు, బఠాణీలు అమ్ముకుంటూ జీవించాడు. ఈ క్రమంలో హరిచంద్‌కు విజయ్‌కుమార్ పుట్టాడు. ఈ బుడతడికి చిన్నప్పటి నుండీ చదువుమీద ఆసక్తి ఎక్కువ. ఐదో తరగతి వరకు తండాలోనే చదివాడు. ఖమ్మం జిల్లా భద్రాచలం గురుకులంలో తొమ్మిదో తరగతి పూర్తిచేసిన విజయ్ ఇప్పుడు పదో తరగతిలో అడుగుపెట్టపోతున్నాడు.

కష్టపడి చదువుతూ...

చిన్నప్పుడి నుండి విజయ్‌కుమార్‌ది కష్టపడి చదివే మనస్తత్వం. తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటూ ఇంటిదగ్గరే పొలం పనులకు వెళుతుండే వాడు. ఏదో సాధించాలనే ఆలోచన ఎప్పుడూ మనస్సును తొలుస్తూ ఉండేది. ఆలోచన ఉంటే సరిపోదు కదా..దాన్ని సాధించాలన్న తపన ఉండాలి. అందుకే చిన్న చిన్న పద్యాలను రాయసాగాడు. అలా ఏడాదిలో విజయ్ వంద పద్యాలు రచించాడు. ఎలాంటి స్థిర, చరాస్తులులేని తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూ విజయ్‌ని ప్రోత్సహించారు. గురుకుల తెలుగు ఉపాధ్యాయులు చక్రవర్తి సహాయ సహకారాలతో పద్యాలన్నింటినీ కలిపి 'అడవి పూసిన వెన్నెల' పుస్తకంగా తీసుకొచ్చాడు. ఎలాంటి వనరులు లేకున్నా అటవీ ప్రాంత మారుమూల గ్రామ విద్యార్థి విజయ్ ఏకంగా ఒక పుస్తకాన్నే రచించి మట్టిలో మాణిక్యమయ్యాడు. పలువురి మెప్పు పొందుతున్నాడు.

లంబాడ లిపి కనిపెట్టాలి

అంతేకాదు! భవిష్యత్తులో తమ మాతృభాష అయిన లంబాడకు లిపిని కనిపెట్టాలన్నది ఆ పిడుగు లక్ష్యం. ఆ ప్రయత్నం కూడా చేస్తున్నాడు. తన కృషి ఫలించి లిపిని కనిపెడితే...దానిని అధికార భాషగా గుర్తించే విధంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని కోరుకుంటున్నాడు. రచనావ్యాసంగానికి సంబంధించి విజయ్‌ను ఎంతగానో ప్రోత్సహించిన తెలుగు ఉపాధ్యాయుడు చక్రవర్తి ఆ పుస్తకం గురించి ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ కార్యదర్శి కె.వి. సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ రవీంద్రబాబు, డిప్యూటీ సెక్రటరీ అప్పారావు దృష్టికి తీసుకెళ్లారు. ఏప్రిల్ 18వ తేదీన హైదరాబాద్ గురుకులంలో కార్యదర్శి చేతులమీదగా పుస్తకావిష్కరణ జరిగింది. కార్యక్రమానికి విచ్చేసిన పెద్దలు చిన్నారి రచయిత విజయ్‌ను ఎంతగానో అభినందించారు.

- ఎం.డి. మజీద్,
ఎల్లారెడ్డిపేట, కరీంనగర్.


హైదరా... ...స్తకావిష్కరణ చేస్తున్న గురుకుల కార్యదర్శి


విజయ్ కుమార్ కుటుంబం

చిన్న కథ

అబ్బ! పోనిద్దురూ...!

ఏం ఆదివారమో ఏమో గానీ, వచ్చిందంటే చాలు. చచ్చేటన్ని పనులు! రైతుబజారుకెళ్లి కూరగాయలు తెచ్చుకోవాలి. మళ్లీ వారమంతా కుదరదాయె! ఈయన బండిమీద తీసుకెళ్తారంటే సెలవురోజైనా పడుకోనీయవంటూ గోల! పైపెచ్చు ఈ పనులన్నా చూసుకోలేవా అంటూ ఆర్గ్యుమెంట్లు. సర్లే! పొద్దున్న పోయి, రాత్రికొచ్చే ఈయన్తో కుదిరే పని కాదు. బస్సులో వెళ్లొస్తే సరి!

బస్సు డ్రైవరేంటీ, ఇవ్వాల్సిన రూపాయి ఎంతకీ ఇవ్వడూ? ఏమయ్యా? నాకివ్వాల్సిన చిల్లర ఇచ్చేదుందా, లేదా? అమ్మో, ఈ కండక్టర్ నోటిదురుసు మనిషిలా ఉన్నాడు. డబ్బులడిగినందుకు ఎంతలేసి మాటలన్నాడనీ..? అందరికీ చిల్లర ఎక్కడినుంచి వస్తుందీ, చిల్లర మీరే తెచ్చుకుంటే సరిపోయేదిగా అంటూ వెటకారాలు. రూపాయి నొక్కేయాలని కాకపోతే ఎందుకీ వేషాలు!

తప్పుకోవమ్మా! అందరం కొంటానికే వచ్చాం! మాయదారోళ్లు రైతుబజారు వీళ్లబ్బ సొమ్మన్నట్లు కూరగాయలెంత అడ్డదిడ్డంగా పరిచేశారో? ఏదో ఇంటిదగ్గరికన్నా చవగ్గా వస్తాయని వచ్చాగానీ...

సరేగానీ, వంకాయలు కిలో ఎంత? ఆ..హా! ఎలా కనిపిస్తున్నానేంటీ..! ఎనిమిదికివ్వు. హమ్మయ్య, ఇచ్చాడు. లేకుంటే నేనూరుకుంటానూ..! ఇంకో రెండు రూపాయలు నా దగ్గర లాగేద్దామనే! నా తెలివితేటల సంగతి వీడికి తెలిసేడిస్తేగా!

కొత్తిమీర ఎట్లా? ఇంకో రెండు కట్టలు ఎక్స్ట్రా వెయ్యి. ఎప్పుడూ కొనేవాళ్ల దగ్గర కూడా ఏంటయ్యా మరీనూ? దెబ్బకు రెండు కట్టలు సంచిలో వచ్చి పడ్డాయి. పిచ్చిమాలోకం! వాడి ముఖం ఎన్నడూ చూసిన గుర్తు కూడా లేదు. అయినా ఇచ్చేశాడంటే నా మంత్రం పనిచేసినట్లే! ఊ...ఊ... రాధా నీ తెలివి అమోఘం!

ఈ లగేజంతా వేసుకెళ్లాలంటే ఆటో తప్పదు. ఇదుగో బాబూ ఇలారా! లగేజీ లేదు, పాడూ లేదుగానీ, మీటర్ వెయ్. ఏంటీ, రూ. 22.60/- అయ్యిందా, ఇంద... 22/- తీసుకో. కుదరదంటే ఎలాగయ్యా? డబ్బులేమైనా చెట్లకు కాస్తున్నాయనుకుంటున్నావా? అదీ..! మొహం ముటముటలాడించినా, సణుక్కున్నా నా డబ్బులు నాకొచ్చాయి. ఊరుకుంటే అంతే! అయినా కష్టార్జితం. ఎక్కడకు పోతుందీ..!

అయినా ఈసారి మాత్రం హాయిగా దగ్గర్లో ఉన్న మాల్కెళ్లి తెచ్చుకోవాలి. డబ్బులెక్కువైతే మాత్రమేం, నీట్గా ప్యాక్చేసి ఉంటాయయ్యే! కానీ అదేంటో, అక్కడి కూరగాయలు చూసినంతసేపూ తాజాగా ఉన్నట్లే ఉంటాయి. ఇంటికి తెచ్చేలోగానే వాడిపోతుంటాయి. వాళ్లు రసాయనాలు కలుపుతారంటారు అదేమాత్రం నిజమో, ఏమో! అయినా, అవన్నీ మనకెందుకులెద్దూ!

మధ్యాహ్నం భోంచేసి కునుకు తీశాక బోర్ కొడుతోంది. ఏం చేయాలబ్బా! అన్నట్లు, పెళ్లిరోజు వస్తోంది. శ్రీవారిని చీర కొనిపెట్టమంటే? ఏ కళనున్నారో వెంటనే ఒప్పేసుకున్నారు. చకచకా రెడీ అయిపోతే సరి!

ఏమండీ..! అలాగే సరదాగా మల్టీప్లెక్స్లో సినిమాచూసి, ఎక్కడన్నా తినేసి వద్దామండీ! మాయదారి వంట రోజూ చేసుకునేదేగా! మల్టీప్లెక్సే ఎందుకంటారా? అబ్బ! మామూలు థియేటర్లలో ఉండే గోలకన్నా మల్టీప్లెక్స్లో సినిమా చూడటం ఓ అందమైన అనుభవం. అయినా రోజూ వెళ తున్నామా, ఏంటీ? ఏదో ముచ్చటపడి అడిగితే కాదనెలా అనబుద్ధవుతుంది మీకూ అంట? హమ్మయ్య, ఒప్పుకున్నారు.

అబ్బ, ఏసీ షాపింగ్మాల్! ఏమైనా వీళ్ల మర్యాదలే వేరు. ఎన్ని వెరైటీ చీరలో కళ్లు జిగేల్మంటున్నాయ్. రేటు గురించి ఆలోచించేదేం లేదుగానీ, కాస్త కొత్త వెరైటీలు చూపించు బాబూ! అబ్బ, ఈ నెమలిపింఛం రంగు చీర అద్దిరిపోయిందండీ! ఏంటలా చూస్తున్నారా? రేటు గురించా? అసలేంటండీ మీరు?! ఏడాదికోసారి వచ్చే పెళ్లిరోజుకు ఆమాత్రం ఖర్చుపెట్టలేరా! కొంటే కొనండి. లేకుంటే నాకసలు ఏమీవద్దు. పదండి ఇంటికి పోదాం. మోజుపడింది దక్కలేదు, నా ఖర్మింతే అని సరిపెట్టుకుంటాన్లెండి! ఆ..ఆ..ఆ..! ఒప్పుకున్నారూ! ఎంతైనా మా వారు బంగారం! ఆ... ఏం...టీ? ధర తగ్గిస్తారేమో అడిగి చూడాలా? హవ్వ! ఎవరన్నా వింటే నవ్విపోతారు. ఇలాంటి పెద్ద షాపుల్లో బేరాలాడితే పల్లెటూరివాళ్లం అనుకుంటారు. ఏంటా దిక్కులు చూడ్డం?! మీకేం తెలీదు. మీరు కాస్త అలా ఉండండి! ఊ... డబ్బులిచ్చేశారుగా! ఇక పదండి! సినిమా టైమైపోతోంది.

చూశారా! సగంలోనే ఏసీ ఆపేసి, చెమటవాసనకొట్టే మామూలు థియేటర్లు ఎక్కడా? భువనైకస్వర్గంలా ఉన్న మల్టీప్లెక్స్లు ఎక్కడా? నక్కకూ, నాగలోకానికీ ఉన్నంత తేడా లేదూ..! అబ్బ! ఊర్కుందురూ! డబ్బుకోసం చూసుకుంటే ఈ సుఖం వచ్చేదా? అయినా ఏటెల్లకాలం జానాబెత్తెడు బతుకులేనా?

అంతే లెండి! వెధవ జన్మ. పెళ్లంటూ చేసుకున్నారు గానీ, నా ముద్దూ ముచ్చట ఎన్నడైనా ఆలోచించారా? సరేగానీ, ఇంటర్వెల్ వచ్చింది. కాస్త కాఫీ తీసుకురండి! ఏంటలా మొహం పెట్టారు? కాఫీ బానే ఉందిగా! ఓహో! రేటా! మరిలాంటిచోట అలాగే ఉంటుంది. మీరు మరీనూ!

ఏమండోయ్, చూశారా! ఎక్కడికో వెళ్లి తినే పన్లేదు. రెస్టారెంట్లూ ఇక్కడే, హాయిగా తినేయొచ్చు. ఒరే చిన్నా! ఈ పేర్లేంటో నాకర్థమై చావడం లేదు కానీ, ఏదో ఒకటి ఆర్డరిచ్చేయ్. హే..మి..టీ! ఇంతింత డబ్బు పోస్తూ కూడా మనమే తెచ్చుకోవాలా? సర్లే, ఏం చేస్తాం! పోయి తెండి. మీరేంటండీ! మాటిమాటికీ మింగేసేలా చూస్తారు? ఇక చాల్లే గానీ, ముందా ప్లేట్లోది మింగండి!

హమ్మయ్య, ఇంటికి చేరాం. తాళం తియ్యండి. వెధవని మోయలేపోతున్నాను. ఏమైనా ఈ రోజు భలే గడిచింది కదండీ! ఏంటలా జైల్లో ఖైదీని చూసినట్లు చూస్తారు? ఖర్చు గురించేగా మీ ఆలోచన! అయినా ఈరోజుల్లో ప్రతి రూపాయికీ లెక్కలేంటండీ చాదస్తం కాకుంటే! వెధవ డబ్బుదేముందీ! ఈరోజు ఉంటుంది, రేపు పోతుంది! పిచ్చి ఆలోచనలన్నీ కట్టిపెట్టి హాయిగా నిద్రపోండి.

పొద్దున్న మళ్లీ కసరత్తు మొదలు. దొంగముండ! ఈరోజు పనెగ్గొట్టింది. రేపైనా వస్తుందో రాదో! ఏమైనా అంటే మీకు మాత్రం సెలవులు లేవూ అని లాజిక్కులు లాగుతుంది. అదికాక మరో వంద పెంచమని చంపుకుతింటోంది. నేనొప్పుకుంటానేంటీ! అడిగిన వెంటనే ఇచ్చేస్తే నెత్తికెక్కి కూర్చుంటారు. వీళ్లని ఎక్కడుంచాలో అక్కడే ఉంచాలి.

అన్నట్లు, పొద్దున్న మీ చెల్లి ఫోన్చేసి స్కూలు ఫీజులు, ఖర్చులు అంటూ... ఏదో బీదరుపులు అరిచినట్లుంది. నేనంతా విన్నాన్లెండి! ఇదుగో, మీకు ముందే చెబుతున్నాను. ఆ బుడిబుడిరాగాలకు లొంగి డబ్బిచ్చారంటే మర్యాద దక్కదు. మనల్ని అడిగే పిల్లల్ని కన్నారా? పెంచుకోలేనోళ్లకు పిల్లలెందుకూ అంట!

నేనోపక్క వాగుతూనే ఉన్నాను. సమాధానం చెప్పరేం? వార్నీ, అప్పుడే గుర్రుపెట్టేశారా? హు! అంతా నా తలరాత! నేను కాబట్టి వేగుతున్నా కానీ...

- కె. అరుణ

చూద్దామా

సుందర దృశ్యాల నందనవనం

టాయ్‌ట్రైన్ లో ప్రయాణం... అతి దగ్గరగా కదిలే మేఘాలు... సూర్యోదయాలూ, సూర్యాస్తమయాలు అద్భుతంగా ఉంటాయక్కడ. బంగారు వర్ణంలో మెరిసే ఉదయభానుడి తొలి కిరణాల మధ్య నుండి వెండి కొండలను చూడడం మరో సుందర దృశ్యం. రంగు రంగుల పూలు, పిల్ల గాలులతో కూడిన ప్రశాంత వాతావరణంలో అలా అలా... నడిచి వెళ్తుంటే.... మైమరచిపోతాం. ఈ అనుభూతులు అందాల సుందర సందాక్‌పూ సొంతం.



ట్రెకర్స్ హట్స్

పశ్చిమ బెంగాల్‌లోని సందాక్‌పూ ఆ రాష్ట్రంలోనే అత్యంత ఎత్తైన ప్రదేశం. సముద్ర మట్టానికి సుమారు 3636 కిలోమీటర్ల ఎత్తులో ఉంటుంది. అక్కడికి వచ్చేవారు ట్రెకింగ్ చేయడమంటే బాగా ఇష్టపడతారు. నడవలేని వారికి వాహనాలు కూడా ఉంటాయి. ఈ ట్రెక్‌లో చాలా భాగం ఇండో-నేపాల్ అంతర్జాతీయ సరిహద్దులో, కొంతభాగం నేపాల్‌లో జరుగుతుంది.

నడవాలనుకునేవారు ముందుగా న్యూ జల్‌పాయ్‌గురి చేరుకుని అక్కడ్నుండి మనేయ్ భంజంగ్‌కు చేరుకోవచ్చు.

జాగ్రత్తలు

ఎక్కడ పడితే అక్కడ నీటిని తాగడం మంచిది కాదు. అందుకే నీటిని శుభ్రం చేసే ట్యాబ్లెట్లు తీసుకెళితే మంచిది. ఇవి డార్జిలింగ్‌లో దొరుకుతాయి. ఉప్పు, గ్లూకోజ్ తప్పక వెంట తీసుకెళ్లాలి.

తినడానికి?

అక్కడి హోటళ్లలో అన్నం, గుడ్లు, రోటీలు, కూరలు అన్నీ దొరుకుతాయి. రుచిగా కూడా ఉంటాయి. ట్రెకర్స్ హట్‌లో నూడుల్స్, అన్నం, క్యారెట్ లేదా బంగాళదుంప కూర, రోటీలు ఇస్తారు.

న్యూ జల్‌పాయ్‌గురి నుండి డార్జిలింగ్ వెళ్లే దారిలో (65 కి.మీ దూరంలో) సుఖియాపొక్రి అనే ఊరు వస్తుంది. అక్కణ్నుండి మనేయ్ భంజంగ్ ఆరు కిలోమీటర్ల దూరం. బయల్దేరిన కొద్దిసేపటికే సిలిగురి అనే ఊరు వస్తుంది. అక్కణ్ణుండి డార్జిలింగ్‌కి టాయ్‌ట్రైన్‌లో వెళ్తే బావుంటుంది. అదేనండీ... స్టీమ్ ఇంజన్‌తో నడిచే రైలు. ఈ రైళ్లు ఇలా ఎత్తైన ప్రదేశాల్లో మాత్రమే కనిపిస్తాయి. కొన్ని చోట్ల టాయ్‌ట్రైన్ వెళ్లే రోడ్డు, బస్సు రోడ్డు పక్కపక్కనే వస్తుంది. సుఖియాపొక్రి వెళ్లే రోడ్డు పక్కనున్న కొండలు... వాటిని తాకుతూ వెళ్లే మేఘాలు... చూపరులకు అద్భుత దృశ్యాన్ని కళ్లముందు ఆవిష్కరింపజేస్తాయి. కదిలే మేఘాల మధ్య తేయాకు తోటలను చూసినవారు ఆ ప్రదేశమంతా ఆకుపచ్చ తివాచీ పరిచారా అనుకోకుండా ఉండలేరు. అక్కణ్ణుండి మనేయ్‌భంజంగ్‌కు వెళ్లే దారిలో వచ్చే వాహనాలన్నింటినీ సరిహద్దు కమెండోలు తనిఖీ చేసి వివరాలు రాసుకుంటారు.

మనేయ్‌భంజంగ్ నుండి 31కి.మీ వెళ్తే సందాక్‌పూ వస్తుంది. అడుగడుగునా రాళ్లు... చిన్న చిన్న మలుపులతో నిండిన ఆ రహదారిలో మామూలు వాహనాలు ప్రయాణించలేవు. అందుకే నడవలేనివారు బ్రిటీష్ కాలంనాటి లాండ్‌రోవర్ వాహనాల్లో వెళ్తుంటారు. ఆ దారంతా ఏటవాలుగా ఉంటుంది. నడిచి వెళ్లేవాళ్లు రెండు కి.మీ దూరంలో ఉన్న ఛిత్రే అనే ఊళ్లో బస చేస్తారు. ఈ దారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన పైన్ వృక్షాలు కనువిందు చేస్తాయి. ఇక్కడి నీళ్లపైపులు చెట్లపై నుండి వేలాడుతూ టెలిఫోన్ కేబుల్ వైర్లను తలపిస్తాయి.

ట్రెకింగ్ చేసేవారు సేదతీరడానికి ఛిత్రే అనే గ్రామంలో చిన్న షెడ్డుల్లాంటి నిర్మాణాలున్నాయి. వీటిని ట్రెకర్స్ హట్స్ అంటారు. ప్రభాతవేళ అక్కణ్ణుండి ఎదురుగా ఉన్న కొండ ఎక్కిచూస్తే కాంచన్‌జంగ శిఖరం అద్భుతంగా కనిపిస్తుంది. అప్పుడే ఉదయిస్తున్న సూర్య కిరణాలు పడి ఆ శిఖరం గులాబీ రంగులో మెరిసిపోతుంది. ఆ దృశ్యాన్ని చూడాల్సిందే కానీ వర్ణించలేం. ఇక తర్వాత మజిలీ 9 కి.మీ. దూరంలో ఉన్న టోంగ్లు. అక్కడికి చేరుకునే దారిలో రోడోడెండ్రాన్ పూలు కనిపిస్తాయి. ఇవి తెలుపు, గులాబీ, ఎరుపు రంగుల్లో చాలా అందంగా ఉంటాయి. ఇవి ఎక్కువగా ఏప్రిల్, మే నెలల్లో పూస్తాయి. ఇక్కడ మరో సుందర దృశ్యం గురించి చెప్పుకోవాలి. ఆ చుట్టుపక్కల ఏ రంగు పూల చెట్లు ఉంటాయో ఆ ప్రదేశమంతా అదే రంగు నిండిపోయి కనువిందు చేస్తుంది.

పొరబడితే నేపాల్‌లో ఉంటాం

ఈ మార్గం చాలా చిన్నది. చిన్న చిన్న వాహనాలు మాత్రమే వెళ్లడానికి వీలవుతుంది. ఆ దారిలో వెళ్తే ఎక్కువ దూరం నడవాల్సి వస్తుంది. అందుకోసం కొంతమంది అంత దూరం నడవకుండా కొన్ని దగ్గర దారుల్లో వెళ్తుంటారు. అయితే అది చాలా ప్రమాదకరం. పొరపాటున వెళ్లారా...



మేఘాల్లో బౌద్ధాలయం



పైన్ వృక్షాలు



ఇండో-నేపాల్ సరిహద్దు

తిన్నగా నేపాల్ సరిహద్దు దాటి ఆ దేశంలో అడుగుపెడతారు. అది నేపాల్ అని తెలియడానికి అక్కడక్కడా సిమెంటు దిమ్మెలు కూడా ఉంటాయి. వాటిమీద మన దేశం వైపు భారత్ అనీ, మరొక వైపు నేపాల్ అనీ రాసుంటుంది. అంటే మనకు తెలియకుండానే నేపాల్‌లోకి వెళ్లిపోతామన్నమాట. అందుకే ఆ మార్గాల్లోకి ఎవరినీ వెళ్లనివ్వరు.

అలా ఘాట్ రోడ్డులో నడుస్తూ వెళ్తుంటే మేఘ్మా వస్తుంది. దీనికి గుర్తుగా సరిహద్దులోనే కమెండోల నివాస సముదాయం ఉంటుంది. ఇక్కడి బౌద్ధుల గుడి చాలా బావుంటుంది. మేఘ్మా దారిపక్కన ఇండో-నేపాల్ సరిహద్దు రాయి కనిపిస్తుంది. అక్కణ్ణుండి నుండి రెండు కిలోమీటర్ల దూరంలో ఒక పర్వతం అంచున టోంగ్లు అనే గ్రామం ఉంది.

మరో విషయం ఏంటంటే ఇక్కడ ఎప్పుడూ మేఘాలు దట్టంగా కమ్ముకుని ఉంటాయి. ఎంతగా అంటే ఎప్పుడు సూర్యోదయం అయిందో, ఎప్పుడు సూర్యాస్తమయమయిందో కూడా తెలియదు. పరిసరాలేవీ సరిగ్గా కనిపించవు. రెండు మూడు మీటర్ల దూరంలో ఏముందో కూడా అర్థం కాదు. ఎక్కువగా మధ్యాహ్న సమయం తర్వాత మేఘాలు దట్టంగా ఆవరిస్తాయి.

ఇక్కడ కనిపించే అద్భుత దృశ్యాల్లో సూర్యోదయం, సూర్యాస్తమయం ముఖ్యమైనవి. ఎక్కువగా మబ్బులు కమ్మేయడం వల్ల వీటి దర్శన భాగ్యం పర్యాటకులకు అరుదుగానే లభిస్తుందని చెప్పాలి. కొండల వెనుక నుండి మబ్బుల మధ్యలో అలా అలా పైకి వచ్చే ఉదయభానుడి తొలి వెలుగు కిరణాలు బంగారు వర్ణంలో ప్రకాశిస్తాయి. అవి కొద్దికొద్దిగా పైకి వస్తూ కాంచన్‌జంగ, పాండిమ్, జాను శిఖరాలమీద వెలుగులు విరజిమ్ముతాయి.

కాంచన్‌జంగకు కుడివైపున పాండిమ్, ఎడమ వైపున జాను పర్వతాలు ఉంటాయి. ఈ మూడు శిఖరాగ్రాలు పడుకుని ఉన్న మనిషి ఆకారంలో కనిపిస్తాయి. జాను శిఖరం తలగాను, కాంచన్‌జంగ శరీరంగాను, పాండిమ్ కాళ్లలా కనిపిస్తాయి. స్థానికులు ఆ ఆకారాన్ని 'నిద్రిస్తున్న బుద్ధుడు' అని చెప్తారు.

పూలూ పక్షులూ!

అక్కణ్ణుండి 15 కి.మీ దూరంలో కాలాపొఖ్రి గ్రామం ఉంది. ఆ దారిలోనే నేపాల్‌లోని టుమ్లింగ్ వస్తుంది. అక్కడ చూడాల్సిన ప్రదేశం సింగలీల నేషనల్ పార్కు. ఈ పార్కుకు వెళ్లే దారిలో ఫెర్న్ మొక్కలు కనిపిస్తాయి. శీతాకాలంలో మంచు కప్పేసిన ఆ మొక్కలు... వేసవి ప్రారంభంలో మంచు కరగడం వల్ల తిరిగి కనిపిస్తాయి. మార్చి, ఏప్రిల్ నెలల్లో చిగురించడం ప్రారంభిస్తాయి. మాగ్నోలియా చెట్లు పూలతో నిండి ఉంటాయి. ఈకాలంలో చూస్తే అసలు ఆ చెట్లకి ఆకులనేవి ఉంటాయా అనిపిస్తుంది. ఈ పార్కులో అక్కడక్కడా ఎర్ర పాండాలు, చిరుతలు, ఎలుగుబంట్లు వంటి జంతువులు కనిపిస్తాయి. ఈ కొండల్లో పుష్పించే రంగురంగుల పూల కోసం సుమారు 600 రకాల పక్షులు ఇక్కడికి వలస వస్తుంటాయి. అవన్నీ ఈ పార్కుకు అదనపు అందాలే.

పార్కు కొండ దిగి నాలుగు కి.మీ నడిస్తే కాలాపొఖ్రి వస్తుంది. అక్కణ్ణుండి సందాక్‌ఫూ ఆరు కిలోమీటర్ల దూరం. సందాక్‌ఫూ దగ్గరికి రాగానే చిన్న చిన్న మంచుగుట్టలు కనిపిస్తాయి. ఇక్కడ్నుండి చూస్తే మబ్బులు కమ్మేసిన హిమాలయాలు కనిపించీ కనిపించనట్లు బహు సుందరంగా ఉంటాయి.



టాయ్‌ట్రైన్

నాలుగు శిఖరాలు!

ప్రపంచంలోని ఎత్తైన మొదటి అయిదు శిఖరాల్లో నాలుగింటిని ఇక్కడి నుండే చూడొచ్చు! అంటే, మొత్తం 320 కి.మీ మేర మంచు కప్పేసిన హిమాలయ పర్వత సముదాయాన్ని ఈ ప్రాంతం నుండి చూడొచ్చన్నమాట. హిమాలయాల్లో మరే ప్రదేశంలోనూ ఇలా కనిపించదు. ఈ దృశ్యాల్ని ఎంతసేపు చూసినా ఇంకా చూడాలని అనిపిస్తుంది. అక్కడ్నుండి 12 కి.మీ వెళ్తే సిరిఖోలా వస్తుంది. ఈ దారి పొడవునా మాగ్నోలియా, రోడోడెండ్రాన్ పూలచెట్లు అందమైన రంగుల్లో కనువిందు చేస్తాయి. ఖోలా అంటే అక్కడి భాషలో నది అని అర్థమట. నదిలోకెళ్లి అక్కడ ఉన్న పెద్ద పెద్ద రాళ్లమీద కూర్చుంటే ఏటి గలగలలు తప్ప మరే శబ్దం వినిపించదు.



మాగ్నోలియా పూలచెట్టు

తిరుగు ప్రయాణం ఉదయాన్నే చేస్తే బావుంటుంది. ఎంచక్కా నదివెంట ప్రయాణిస్తూ మనేయ్‌భంజంగ్ చేరుకోవచ్చు. అక్కణ్ణుండి న్యూ జల్ పాయ్‌గురి వెళ్లి ట్రైన్ మీద రావచ్చు.

ట్రెకింగ్ కాస్త కష్టమనిపించినా శరీరానికి మంచి వ్యాయామం. మొత్తమ్మీద ఇదో అద్భుతమైన ప్రయాణం!

ఖర్చులు

అనేక ట్రావెల్ ఏజెన్సీలూ ట్రెకింగ్ ఏజెన్సీలూ 'సందాక్‌ఫూ, డార్జిలింగ్ ట్రెకింగ్' నిర్వహిస్తుంటాయి. పది రోజుల ఈ ట్రెకింగ్‌కు ఒక్కో మనిషికి 25 వేల నుండి 48 వేల వరకూ తీసుకుంటారు. ఫస్ట్‌క్లాస్ హోటల్ వసతి, టెంట్లు, గైడు, భోజనాలు... అన్నీ వాళ్లే సమకూరుస్తారు. ఈ ట్రెక్‌లో భాగంగా డార్జిలింగ్‌లోని పర్యాటక ప్రదేశాలన్నీ చూడొచ్చు.

సూచనలూ.... సలహాలూ...

వాతావరణం ఎప్పుడెలా ఉంటుందో చెప్పలేం కనుక రెయిన్‌కోటు తప్పనిసరి. ట్రెకింగ్ చేసేవాళ్లు నీళ్లు ఎక్కువగా తాగాలి. మంచుమీద ఎక్కువగా ఆడకూడదు. అందరితో కలిసి కదలాలి. ★

పండగ, పబ్బం ... పెళ్లి, పేరంటం వచ్చిందంటే చాలు! మహిళలు పట్టుచీర కట్టుకోడానికి ఇష్టపడుతుంటారు. ఇంక ఆ సందర్భంగా చేసుకొనే అలంకరణ గురించి చెప్పాలంటే పేజీలు చాలవు. సౌందర్యాభిలాష పెరిగిపోయి మేకప్ సామగ్రి వాడకమూ ఊపందుకుంది. కానీ ఒక్క పట్టుచీర కోసం ఎన్ని పట్టుపురుగులు వేడినీళ్లలో విలవిల్లాడిపోతున్నాయో! వాటిని అంతలా బాధపెట్టి తయారుచేసే పట్టుచీర కట్టకపోతేనేం! అని ఎవరూ ప్రశ్నించుకోవడంలేదు. అసలు మనం కట్టుకునే పట్టుచీరల్లోనే కాదు... మనం వాడే ఎన్నో వస్తువుల్లో అలాంటి జంతువుల ఆక్రందనలు, రోదనలు నిక్షిప్తమై వున్నాయి. లిప్‌స్టిక్ వేసుకున్నప్పుడు ఎలుక గావుకేకలు, ముఖానికి సౌందర్యక్రీమ్ రాసుకున్నప్పుడు కుందేలు పెడబొబ్బలు, బూట్లు తొడుక్కున్నప్పుడు ఎద్దు ఆక్రందనలు, లైంగిక సామర్థ్యం మెరుగుపరిచే ద్రావకాలను ఉపయోగించినప్పుడు అనేకానేక జంతువుల రోదనాగీతాలు, ఇంకెన్నో మందుల్లో మరేవో జీవుల ఆర్తనాదాలు...వినగలిగితే అంతా విషాద సంగీతమే. తెలిసో తెలీకో వాటిని వాడుతున్నాం. ప్రత్యక్షంగానో పరోక్షంగానో లక్షలాది జీవాలకు బతుకు లేకుండా చేస్తున్నాం. ఇవేగాక సౌందర్యసాధనాలను ముందుగా జంతువులమీదే పరీక్షిస్తున్నాం. మానవుని సౌందర్య పిపాస మూగజీవులపాలిట శాపంగా ఎలా తయారైందో ఈ వారం అట్టమీది కథలో....

- డా॥ కాకర్లమూడి విజయ్

అందం వెనుక అమానుషం

మానవులమైనందుకు మనకు కొంత అభిజాత్యం, మరికొంత గర్వం, ఇంకొంత అహంకారం స్వతహాగా అబ్బుతాయి. సదరు (అవ) లక్షణాలను సాటి మానవులపైనే ప్రదర్శించడం సామాన్యమైనప్పుడు ఇంక సాటి జంతువులపైనా, మొక్కలపైనా, . మొత్తం ప్రకృతిపైనా చూపడంలో వింతేముంది? మనం ప్రకృతిలో అత్యున్నత స్థానంలో ఉన్నామన్న ధీమా, భ్రమ, పొగరు, మిడిసిపాటు వల్ల మానవేతర జీవుల పట్ల నిర్లక్ష్యం మన అణువణువునా, మన అడుగడుగునా పొడసూపుతూనే ఉంటుంది. దీనికి తోడు మనకి మాత్రమే కొన్ని విచిత్ర లక్షణాలున్నాయి. వాటి జాబితా దాదాపు అనంతమే అయినా, వాటిలో కాస్త ముఖ్యమైనది సౌందర్య పిపాస. అంటే మన చుట్టూ ఉన్న ప్రకృతిలోను, అందులోని ఇతర జీవ, నిర్జీవ అంశాల సౌందర్యాన్ని ఆనందించడం, ఉన్న దాన్ని కాపాడడం, పరిరక్షించుకోవడం కాదు. మన సౌందర్య పిపాస కేవలం మన [illegible] పట్లే! ఈ అంతులేని దాహాన్ని తీర్చుకునే క్రమంలో ఎన్ని దారుణాలు చేయవలసి వస్తుందో చాలామందికి తెలియదు. అంటే, ఒకవేళ తెలిస్తే మాత్రం అటువంటి పనులు మానేస్తారని కాదు గానీ... తెలియదు అంతే. అటువంటి దారుణాలలో అమాయక జీవులపై సౌందర్య సాధనాల పరీక్ష ఒకటి. ఆ పరీక్షల వల్ల, మనకు జరగవలసిన అపకారాలు, ప్రమాదాలు ముందుగా ఆ జంతువులే ఎదుర్కొని, మనకోసం నిరపాయకరమైన ఉత్పత్తిని అభివృద్ధి చేసే వీలు కల్పిస్తాయి. అటువంటి పరీక్షల్లో వాటిల్లే నొప్పి, బాధ, వేదన వంటివాటిని అవి మూగగానే భరిస్తాయి. ప్రాణాలు సైతం సమర్పిస్తాయి... మన అందం, ఆనందం కోసం! అయినా మనకి అదంతా అనవసరం.

కొత్తగా మార్కెట్‌లోకి వచ్చిన ఫెయిర్‌నెస్ క్రీం ప్రచారం చూసి లలిత ఆనంద పడింది. అది రాసుకుంటే నాలుగు వారాల్లో చర్మం తెల్లగా మారుతుందట. వెంటనే కొనేసి రాసేసుకుంది. అరగంటలో చర్మం మంటపుట్టడం ప్రారంభమైంది. క్రీం పనిచేయడం మొదలయిందేమో అనుకుంది. అలాగే ఉంచుకుంది. పోనుపోను మంట పెరిగిపోయింది. గంట తర్వాత ఇక భరించలేక మొహం కడుక్కుంటే చర్మం తెల్లగా కాకుండా ఎర్రగా కమిలిపోయింది. మామూలు స్థితికి రావడానికి రెండు నెలలు పట్టింది.


ఎన్నెన్ని పరీక్షలో...



రోజీ తన మల్టీనేషనల్ కంపెనీ ఉద్యోగానికి రోజుకో రంగు లిప్‌స్టిక్ రాసుకుని వెళ్తుంది. తరచూ కొత్త కొత్త ఉత్పాదనలు వాడడం తనకి అలవాటు. ఒకానొక లిప్‌స్టిక్ వాడితే నోరు పూసింది. తగ్గడానికి వారం పట్టింది.

చవకరకం ఉత్పత్తులు వాడడం వల్ల ఇటువంటి ప్రమాదాలు జరగడం కద్దు. ఖరీదైన, నాణ్యమైన ఉత్పత్తులు ఇటువంటి పరిస్థితులను కల్పించడం అరుదు. అందుకు కారణం అటువంటి ఉత్పత్తుల తయారీకి ముందు జరిగే పరిశోధన, పరీక్షలే. వాటి ద్వారా ఒక క్రీమో, ఒక షాంపూనో, ఒక స్ప్రేనో... మనపై ఎటువంటి ప్రభావం కలిగిస్తుందో ముందే తెలుసుకుంటారు. అయితే అటువంటి పరీక్షలకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చే మానవులు ఉండరు. అందువల్ల ఆ పరీక్షలు మన శరీర ధర్మానికి దగ్గరగా ఉన్న ఇతర జంతువులపై జరుపుతారు. ముఖ్యంగా ఎలుకలు, కుందేళ్లు, పందులు, గినీ పందులు, కోతులు, చివరికి పిల్లులు, కుక్కలు కూడా ఇందుకు ఉపయోగ పడతాయి.

రసాయనిక, ఔషధ, ఆహార, సౌందర్య పరీక్షల కారణంగా ఏటా వంద మిలియన్లకు పైగా వివిధ జంతువులు దారుణంగా మరణిస్తున్నాయి. ఇక అవి కాక ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యాలయాలు తమ విద్యార్థులకి, పరిశోధనాలయాలు తమ ప్రయోగాలకి అసంఖ్యాకంగా జంతువులను వినియోగిస్తున్నాయి. కాస్మొటిక్కులు, గచ్చు కడిగే క్లీనర్లు, డిటర్జెంట్లు, సబ్బులు, షాంపూలు, డియో స్ప్రేలు వంటి వాటి పరీక్షలు చాలా దారుణంగా ఉంటాయి. ఉదాహరణకి డ్రెయిజ్ పరీక్ష. ఈ పరీక్ష ఉద్దేశ్యం సౌందర్య సాధనాల్లోని రసాయనాలు మానవుల కళ్లకు, చర్మానికి ఏ మేరకు హాని చేస్తాయో తెలుసుకోవడం. అందుకు ఇతర జంతువులను వాడతారు. ఈ పరీక్షలో రసాయనాలను (ఉత్పత్తులను) జంతువుల కళ్లలోకి నేరుగా వేస్తారు. అటువంటి సమయంలో అవి కళ్లు మూసుకోకుండా కనురెప్పలను క్లిప్పుల సాయంతో తెరిచి ఉంచుతారు. ఈ పరీక్షలు ఇలా కొన్ని రోజుల పాటు (పది నుండి ఇరవై రోజులు) కొనసాగుతాయి. అంతవరకూ అవి కళ్లు ఆర్పలేవు. అంతే కాకుండా అవి తలను అటూ ఇటూ కదిపితే కళ్లలోని రసాయనం 'వేస్టు' అవుతుందని వాటి తలల్ని కదలకుండా బంధిస్తారు. మనకి కంటిలో నీటి చుక్క పడితేనే విపరీతమైన విన్యాసాలు చేస్తాం. అటువంటిది, శక్తివంతమైన రసాయనాల వల్ల కలిగే మంట, నొప్పి, బాధతో ఆ జంతువుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. పైగా పరీక్షలు ముగిశాక, దెబ్బతిన్న కళ్లలో నుండి రక్తం కారుతుంది. కళ్లు ఎంతమేరకు దెబ్బతిన్నాయో ప్రతి డెబ్బై రెండు గంటలకోసారి

ఆశ్చర్యం కలిగించే సౌందర్య సాధనాలు

అందం కోసం మనుషులు ఎంతకైనా తెగిస్తారనే ఉదంతాలు ఉన్నాయి. అయితే కొన్ని సౌందర్య సాధనాలు మరీ విచిత్రంగా, కించిత్ ఆశ్చర్యకరంగా ఉంటాయి. పూర్వం ఈజిప్టు వాసులు తేనె, వెన్న వంటి జంతు సంబంధ పదార్థాలను చర్మ సౌందర్యం కోసం వాడేవారు. అప్పుడే, మొసళ్ల పేడ కూడా మొహమ్మీద పూసుకుంటే అందం సొంతమౌతుందని అనుకునేవాళ్లట! ఇంత వైచిత్రి అప్పుడే కాదు, ఇప్పుడూ ఉంది. చదవండి.

మొహంపై సన్నని ముడతలు పోగొట్టుకోడానికి కొల్లాజెన్ ఇంజెక్షన్లు వాడతారు. కొల్లాజెన్‌ని ఆవుల నుండి తీస్తారు. అయితే కొంతమందికి ఆవు కొల్లాజెన్ అలర్జీ కావడంతో మానవ గర్భస్థ శిశువుల నుండీ, గర్భాశయం నుండీ, మృత కళేబరాలనుండీ తీయడం మొదలుపెట్టారు.

కొల్లాజెన్ లాగే, బోటాక్స్ కూడా మొహం మీది ముడతలని ఇస్త్రీ చేస్తుంది. కానీ బోటాక్స్ ఎక్కడినుండి వచ్చిందో తెలిస్తే ఆశ్చర్యపోతాం. క్లోస్ట్రిడియం బోట్యులినం నుండి తీసే ఈ అతి విష పదార్థం ప్రాణాంతకమైనది. ఒక మైక్రో గ్రామ్ పదార్థం మనిషిని నిలువునా చంపేస్తుంది. సూక్ష్మ జీవుల నుండి వచ్చే బోటాక్స్ చాలా తక్కువ మోతాదుల్లో ముడతలు సాపు చేయడానికి వాడతారు.

పాము విషం కూడా బోటాక్స్ వంటి ఫలితాన్నే ఇస్తుందని గ్రహించాక విష సర్పాల విషాన్ని కృత్రిమంగా తయారు చేసి, దానితో క్రీం రూపొందించి మొహంపై వాడుతున్నారు.

ముడతలు పోవడానికి, చర్మాన్ని యవ్వనవంతం చేయడానికి పశువుల ప్లాసెంటా నుండి తయారు చేసిన క్రీం వాడతారు. సుమారు డెబ్బై ఏళ్ల క్రితమే దీనిని వాడడం మొదలు పెట్టారు. కొన్ని కంపెనీలు మానవ ప్లాసెంటా వాడతాయి.

వెంట్రుకలకి ప్రోటీన్ పూత పూస్తే అవి మెరుస్తాయని తెలిసి, వీర్యం కన్నా గొప్ప ప్రోటీన్ ఏముందనుకున్నారు బ్రిటన్ వాసులు. అందుకే అక్కడ ఈ ట్రీట్‌మెంట్ ఎక్కువ.

పక్షుల విసర్జనలో గ్వానిన్ అనే పదార్థం ఎక్కువ. అది ఒక విధమైన మెరుపుని కలిగిస్తుంది. జపాన్‌లో ఈ విషయాన్ని చాలా సీరియస్‌గా తీసుకుని కోకిల రెట్టలను సేకరించి, నునుపుదనం, మెరుపు కోసం మొహానికి పూసుకుంటారు. ఇది శతాబ్దాల నుండి వస్తున్న అలవాటే. కానీ, రెట్ట అక్కడ చాలా ఖరీదు.

అందమైన పాదాలు కావాలని కోరుకోనిదెవరు చెప్పండి? అందుకే మనం పాదాలను చేపలున్న నీటిలో పెడితే సరిపోతుంది. అవును, కార్ప్ జాతి చేపలు నింపిన టాంక్‌లో కాళ్లుపెట్టి కూర్చుంటే, చేపలు మృదువుగా పాదాలపై మృతకణజాలాన్ని తినేస్తాయి. పాదాలను మృదువుగా చేస్తాయి.

శరీరంలో రక్తపు గడ్డలు తగ్గించడానికి జలగ చికిత్స ఉంది. జలగలు రక్తం పీల్చుకుంటుంటే చూస్తూ ఉండడమే. ఎన్నో రకాల ట్రీట్‌మెంట్‌లకు జలగలను వాడడం క్రీస్తుశకం వెయ్యవ శతాబ్దం నుండే వుంది.

ముడతలు పోవడానికి లేపనాలూ, ఇంజెక్షన్లూ కన్నా ఏకంగా పంది గిట్టలను తినడమే బెస్టైన ట్రీట్‌మెంట్ అంటున్నారు కొందరు. ఎందుకంటే ఆ గిట్టలలో కొల్లాజెన్ అధికంగా ఉంటుందన్నది వారి వాదన.

నత్త పాకుతూ పోతే దాని దారి నిండా జిగట నిండి ఉంటుంది. ఆ జిగట పదార్థం గాయాలను మాన్పి, కొత్త కణాల్ని పుట్టిస్తుందని తెలిసి, మొటిమలు, గాట్లు, మరకలు, మచ్చలు వంటి అనేక వాటికి ఆ జిగటని వాడుతున్నారు.



పాదాలను శుభ్రంచేసే కార్ప్ చేపలు



మనకోసం మరణించే జంతువులు

కోతులు, చింపాంజీల వంటి ప్రైమేట్లను ముఖ్యంగా ఔషధాలు, వ్యాక్సిన్ల పరీక్ష కోసం వాడతారు. వ్యాక్సిన్ల కోసమైతే వాటికి వ్యాధులను అంటించి, విరుగుడు కోసం పరీక్షిస్తారు. వాటిలో చాలా ప్రయత్నాలు విఫలమయ్యాయి. అందుకు మంచి ఉదాహరణ హెచ్ఐవి. ఇంకా క్రూరమైన పరీక్షల్లో కోతుల కపాలానికి రంధ్రాలు చేసి, వాటి మెదళ్లలో ఎలక్ట్రోడ్లు జొనిపి వివిధ పరీక్షలు చేస్తారు.

కుందేలు

అధిక సంతానోత్పత్తి, సౌమ్యత వంటి లక్షణాలు కుందేళ్లకు శాపాలయ్యాయి. అనేకానేక పరీక్షల్లో ముందు ఉండేవి అవే. క్యాన్సర్ కణాలను ఇంజెక్ట్ చేసి ఎప్పటికప్పుడు పరిశీలిస్తుంటారు. అలాగే నొప్పి పరీక్షల్లో భాగంగా బలవంతంగా విద్యుత్ షాక్‌లు కూడా ఇస్తారు. ఇక దాదాపు ప్రతి మందు, రసాయనం ముందు కుందేళ్ల పైనే ప్రయోగించి చూస్తారు. ఇటువంటి పరీక్షల్లో కుందేళ్ల తర్వాతి స్థానం ఎలుకలది. అలాగే కుక్కలు, పిల్లులు కూడా మన కోసం పరీక్షల్లో నిలబడతాయి. అయిష్టంగా, బలవంతంగా.

స్లెండర్

చూడ్డానికి విచిత్రంగా వుండే ప్రాణి స్లెండర్ లోరిస్. ఇంతింత కళ్లతో తమాషాగా కనిపించే ఈ జీవిని అపశకునంగా భావిస్తారు. 350 గ్రాముల బరువుతో చేతిలో ఇమిడిపోయే ఈ క్షీరదాన్ని అందం కోసం వాడే ఉత్పత్తులూ, ఆస్తమా కోసం వాడే ఔషధాల్లోనూ ఉపయోగిస్తారు. దాంతో ఈ జాతి ప్రమాదంలో పడింది. దీని మెదడు చూర్ణంతో ఒంటికి నిగారింపు వస్తుందని భావిస్తారు. స్లెండర్ ఎడమకాలు తింటే కుష్ఠురోగం పోతుందనీ, కుడికాలు తింటే దగ్గు తగ్గుతుందనీ, కళ్లతో నేత్ర సంబంధ వ్యాధులు తొలగిపోవడమేకాక శృంగార సామర్థ్యం మెరుగౌతుందని నమ్ముతుంటారు.

ముంగిస

కళ కాసులు కురిపిస్తుందో లేదో కానీ ముంగిస ప్రాణాలను మాత్రం తీస్తోంది. ఆర్టిస్టులు వాడే బ్రష్షులను ముంగిస రోమాలతో చేయడమే అందుకు కారణం. ఈ బ్రష్షులకు మాంచి గిరాకీ వుండడంతో ఢిల్లీ నుంచి గల్లీ దాకా వేటగాళ్ల కన్ను వీటి మీద పడింది. పోలీసులు అడపాదడపా వేల సంఖ్యలో బ్రష్షులను పట్టుకున్న దాఖలాలున్నాయి. కాకపోతే ఒక్కో ముంగిస నుంచి 40 గ్రాముల వెంట్రుకలు మాత్రమే లభిస్తాయి. వాటిని శుద్ధి చేసేసరికి మిగిలేది 20 గ్రాములే. ఒక కిలో వెంట్రుకలు పోగేయాలంటే 50 ముంగిసలను చంపాల్సి వుంటుంది. దీంతో వీటి సంఖ్య బాగా తగ్గిపోతోంది. దేశం మొత్తమ్మీద ఇలాంటి బ్రష్షులమ్మే షాపులు 350-400 వరకు వున్నాయి.

యాంటిలోప్

మేక జాతికి చెందిన టిబెటన్ యాంటిలోప్ ఉన్ని నుంచి పాతూష్ అనే శాలువా తయారు చేస్తారు. దీన్ని వాడడం ఓ స్టేటస్ సింబల్. 'పాతూష్' అంటే 'చక్రవర్తులకు తగినది' అని అర్థం. ఈ శాలువాలు మాంచి వెచ్చగా వుంటాయి. సన్నని పోగులుగా వుండే ఈ ఉన్ని చూడముచ్చటగా వుండడంతో పాటు అత్యంత తేలిగ్గా వుంటుంది. మూడు మీటర్ల శాలువా 160 గ్రాముల బరువు మాత్రమే తూగుతుంది. ఇంత నాజుగ్గా వుంటుంది కాబట్టే దీని ధర 50,000 నుంచి లక్ష రూపాయల వరకు పలుకుతుంది. అయితే గొర్రె బొచ్చు మాదిరిగా గొరిగి శాలువాలు తయారుచేయలేం. అందుకే వాటిని చంపి చర్మాలను సేకరిస్తారు. ఒక్క షాల్ కోసం మూడు నుంచి ఐదు యాంటిలోప్‌ల ప్రాణాలు తీయాల్సి వుంటుంది. టిబెట్ ప్రాంతంలో సంచరించే వీటిని పట్టుకోడానికి ఏకంగా బృందాలే పుట్టుకొచ్చాయంటే నమ్మండి.

నమోదు చేసుకుంటారు. ఈక్రమంలో కంటి చూపు పోతుంది కూడా. అంతే కాక జంతువులని బంధించి ఈ పరీక్షలు చేయడం వల్ల అవి తప్పించుకునే ప్రయత్నం చేస్తూ మెడలు విరిగి చనిపోతాయి కూడా. ఒక అంచనా ప్రకారం ఇటువంటి పరీక్షల్లో యాభై శాతం జంతువులు మరణిస్తాయి.

డ్రేయిజ్ పరీక్షల్లో మరొకటి చర్మ పరీక్ష. క్రీం గానీ, లోషన్ గానీ పరీక్ష చేయడానికి చర్మంపై వెంట్రుకలని తొలగిస్తారు. అంటే ఒక కుందేలునో, కోతినో పట్టుకుని నెమ్మదిగా షేవ్ చెయ్యరు. ఆ జంతువుల వెంట్రుకలపై ఒక టేప్ అతికించి అమాంతం లాగేస్తారు. అలా ఒకసారికాదు అనేకసార్లు చేయడం వల్ల వెంట్రుకలు, వాటితో పాటు చర్మం కొన్ని పొరలు కూడా ఊడిపోతాయి. ఇదే చాలా బాధాకరంగా ఉంటుందంటే, అటువంటి 'పచ్చి' చర్మంపై రసాయన క్రీములు పూసి రోజుల తరబడి ఉంచితే? ఎంత బాధో ఊహకి అందనిది కాదు. ఇంకొన్ని పరీక్షల్లో షాంపూలని జంతువుల నోట్లో పోసి (బలవంతంగా) ఆ తర్వాత వాటిని చంపి, శరీర అంతర్భాగాల్లో ఎటువంటి మార్పులు జరిగాయో తెలుసుకుంటారు.

ఇటువంటిదే ఎల్‌డి50 అనే మరో పరీక్ష. సదరు రసాయనాన్ని ఒక జంతువుల గుంపుపై వాడతారు. ఆ రసాయనం ఏ మోతాదులో వాడితే గుంపులో సగానికి సగం మరణిస్తాయో చూస్తారు. అంటే, ఒక వంద జంతువులకు రసాయన మోతాదును క్రమ క్రమంగా పెంచుతూ ఇస్తారు. ఏ మోతాదు దగ్గర ఆ వంద జంతువులలో యాభై చనిపోతాయో నిర్ధారిస్తారు. ఆ తర్వాత అంతకంటే తక్కువ మోతాదులో ఆ రసాయనాన్ని మార్కెట్లోకి విడుదల చేస్తారు. ముఖ్యంగా క్రిమిసంహారక మందుల తయారీలో ఈ పద్ధతి ఎక్కువగా అమలులో ఉంది. విశ్వ విద్యాలయాల్లో జీవ శాస్త్ర పరిశోధనల్లో కూడా ఈ పద్ధతి ఉంది. ఇవి కాక జంతువుల ప్రత్యుత్పత్తిపైనా పరీక్షలు జరుపుతారు. రసాయనాలను బలవంతంగా జంతువులలోకి నెలలూ, ఏళ్ల తరబడి ఎక్కించి వాటి సంతానోత్పత్తి సామర్థ్యాన్ని పరిశీలిస్తారు. ఆ తర్వాత ఆ జంతువులను చంపేస్తారు.

ఒకసారి ఒక ఉత్పత్తిపై జంతు పరీక్షలు జరిపితే, మళ్లీ అటువంటి పరీక్షల అవసరం లేదు. కానీ 'కొత్త', 'మెరుగైన' వంటి మార్పులకు మళ్లీ పరీక్షలు అవసరమౌతాయి. అయితే జంతువులపై పరీక్షలు చేయడాన్ని కంపెనీలు సమర్థించుకుంటున్నాయి. ఎన్నో దేశాలలో నిల్వ పదార్థాలు, లోషన్లు, క్రీములు వంటి వాటిని మనుషులు వాడే ముందు పరీక్షించాలనే నిబంధనలున్నాయన్నది వారి వాదన.

మనుషులు ఉపయోగించే మందులు, వ్యక్తిగత సౌందర్య సాధనాలు, తినే ఆహర పదార్థాల వల్ల ఏమైనా హాని జరుగుతుందేమోనని తెలుసుకోడానికి జంతువులపై పరీక్షించి చూడడం అన్నది సుమారు తొంభై దశాబ్దాల నుండీ వస్తున్నదే. ఇటువంటి మానవేతర జీవులపై పరీక్షలు ఒకప్పుడు తప్పనిసరి అయినా, ప్రస్తుతం వాటికంటే మెరుగైన, జంతువుల ప్రస్తావన లేని పరీక్షలు అభివృద్ధి చెందాయి. వాటివల్ల మనం ఇతర జంతువులపై కాకుండా కృత్రిమ అవయవాలపై, కణజాలంపై, దానం చేసిన శరీర భాగాలపై, కంప్యూటర్ సాయంతో ప్రమాదాలను అంచనా వేయొచ్చు. ఈ కొత్త తరహా పరీక్షలు తక్కువ ఖర్చుతో, త్వరగా, విశ్వసనీయమైన ఫలితాలను ఇస్తాయి. ఇటువంటి

ఎన్నెన్నో రూపాల్లో...

అందం అంటే కేవలం శరీర సంబంధమే కాదు కదా! దాన్ని కప్పుకునే క్రమంలోనూ అందం వుంటుంది. అటువంటి వాటికీ జంతువులు మనకి ఉపయోగపడుతున్నాయి. పట్టు వస్త్రాలు ఎక్కడినుండి వస్తాయో మనకు తెలుసు. కొన్ని లక్షల పట్టుపురుగులు తమ ప్రాణాల్ని బలి ఇచ్చి మనకి పట్టు అందిస్తాయి. (కానీ అవేమీ మనకోసం స్వచ్ఛందంగా పట్టు ఇవ్వవు. మనమే వాటిని చంపి తీసుకుంటాం.) అలాగే, చలికాలంలో మనల్ని వెచ్చగా ఉంచడానికి ఎన్నో జంతువుల వెంట్రుకలు ఉన్ని రూపంలో మనల్ని కాపాడతాయి. అయితే ఉన్ని కోసం జంతువులని చంపనవసరం లేకపోవడం ఒక ఊరట. కొన్ని జంతువులు (మింక్ వంటివి) చిన్నగా ఉంటాయి. కానీ వాటి వెంట్రుకలు బహు సున్నితంగా ఉంటాయి. అందువల్ల ఆ జంతువులను ఎక్కువ సంఖ్యలో చంపితే గానీ మన శరీరాన్ని కప్పేందుకు సరిపడా ఉన్ని దొరకదు. ఇక జంతుచర్మం నుండి కోట్లు, బెల్టులు, బ్యాగులు... అన్నీ సౌందర్యాన్ని అధికం చేసేందుకే తయారు చేసేవే! అలాగే శరీరం సువాసన భరితంగా ఉండడానికి కస్తూరి జింక వంటి జంతువులను చంపి వాటి సువాసన గ్రంథులను సేకరించి, వాటి నుండి మనకు అవసరమైన సుగంధ ద్రవ్యాలను రూపొందిస్తాం.



సదుపాయాలు ఉన్నప్పటికీ ఇంకా మనలోని క్రూరత్వాన్ని కొనసాగించడం సబబు కాదని ఇప్పటికే ఐరోపా సమాఖ్య జంతు పరీక్షలను నిషేధించింది. అసలు ఈ పరీక్షలు అమానుషమైనవే కాకుండా, వాటి ఫలితాలు అంత నమ్మదగ్గవి కూడా కాదు. జంతు హక్కుల వాళ్ల నిరసలు చేయడంతో ఎవన్, బూట్స్, యార్డ్లీ, రెవ్లాన్ వంటి ప్రముఖ కంపెనీలు తమ ఉత్పత్తుల కోసం జంతువులపై పరీక్షలు నిలిపేశారు. ఇంకొన్ని హానికరంకాని సహజ పదార్థాలతో ఉత్పత్తులు చేయడం ఆరంభించాయి. ఇప్పుడు అటువంటి నిరసనలు ప్రపంచవ్యాప్తంగా వ్యక్తమౌతున్నాయి. మరికొన్ని మాత్రం నిషేధమే అమానుషమని కోర్టులకెక్కాయి. బ్రిటన్‌లో 1998లోనే కాస్మొటిక్‌ల కోసం జంతు పరీక్షలు జరపడానికి లైసెన్స్‌లు ఇవ్వడం ఆపేశారు. ఆ తర్వాత 2009లో ఈ నిషేధం యూరప్ మొత్తానికి వర్తింపచేయబడింది. ఇక 2013 కల్లా ఐరోపా సమాఖ్యలోని సభ్యదేశాలలో అన్ని రకాల జంతు పరీక్షల ద్వారా తయారైన సౌందర్య సాధనాల అమ్మకాలు చట్ట వ్యతిరేకంగా పరిగణిస్తారు. విశేషమేమిటంటే ఈ నిషేధం కేవలం కాస్మొటిక్ ఉత్పత్తులకే. మరొక చట్టం ద్వారా ముప్పైవేల రసాయనాలకు జంతు పరీక్షలు అవసరం అని ఉంది! జంతు పరీక్షలకు ప్రత్యామ్నాయంగా పరీక్షలు అభివృద్ధి పరిచే వరకు ఇటువంటి నిషేధాలు వాయిదా వెయ్యవలసిన అవసరం లేదు. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ



జంతు పరీక్షల నిషేధం అనుకున్న ప్రకారం అమలు కావలసిందే అంటుంది ఐరోపా సమాఖ్య. ఇటువంటి పట్టుదలే ప్రస్తుతం కావలసింది. ఎందుకంటే నిజానికి మనకి మరిన్ని 'కొత్త' సౌందర్య సాధనాల అవసరమే లేదు. ఉన్నవే ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

మనకంటే చిన్న, అమాయక, నిస్సహాయ జీవులను ఇంత అమానుషంగా చిత్రహింసలకు గురిచేసి, తద్వారా తయారైన ఉత్పత్తులను వాడడం ఎంత వరకు సమంజసం? సగటు వాడకం దారునికి ఈ విషయాలు చాలా వరకు తెలియవు. అసలు సౌందర్య సాధనాల తయారీదార్లు ఆశ చూపినట్లు ఫలితాలు ఉండవన్న విషయమూ తెలియదు. వాడిన తర్వాత కూడా ఆశించిన ఫలితం కనబడక పోతే, తప్పు తమదనే అనుకుంటారు తప్ప సదరు ఉత్పత్తి ఉత్తుత్తిదని అనుకోరు. సౌందర్యాభిలాష సర్వత్రా, లింగ భేదంతో నిమిత్తం లేకుండా ఉందన్నది వాస్తవం. తమ డబ్బు, తమ చర్మం, తమ ఇష్టం అనుకుంటే ఇబ్బంది లేదు కానీ, అటువంటి తమ ఇష్టానికి కొన్ని జంతువులు చిత్రహింసలకు గురవుతున్నాయన్న విషయాన్ని గ్రహించాలి. మానవత్వంతో మసలుకోవాలి. మన సౌఖ్యం కోసం బలవుతున్న అల్ప జీవులపై కాస్త కరుణ, జాలి, సానుభూతి చూపించాలి. అవి జంతువులైనందుకు కాకపోయినా కనీసం మనం మనుషులమైనందుకైనా.

ఆశలను క్యాష్ చేసుకునే వ్యాపారం

ప్రపంచంలో ఏ క్రీమూ, ఏ లోషనూ చర్మం రంగును మార్చదు. ఏ నూనె కొత్త వెంట్రుకలను మొలిపించదు. మొక్క రసాలు తాగి, ఏవో తైలాలు బానపొట్టకు పూసుకుని సన్నబడ్డవారు లేరు. సబ్బులు రుద్దుకుని తెల్లబడడం అటుంచితే, అసలు ఉన్న నునుపుదనం కూడా పోగొట్టుకున్న వాళ్లు అనేకమంది. అయినా మనిషికి ఆశ చావదు. కాస్మొటిక్ కంపెనీలకూ ఆశ తీరదు. నిజానికి చాలా సౌందర్య సాధనాలల్లో వాడే పదార్థాలు దీర్ఘకాలంలో హాని కలిగిస్తాయని నిరూపితమైంది. అయినా జనం ఇటువంటి నిరూపణలను పట్టించుకోరు. ఇటీవల 'నేచురల్ ప్రొడక్ట్'ల తాకిడి ఎక్కువైంది. సహజ పదార్థాల వల్ల ఆశించిన లాభం మాట అటుంచితే, హాని కలగక పోవడమే పెద్ద లాభం. ఈ మధ్య అటువంటి 'సహజ' ఉత్పత్తులలో కూడా కల్తీలు ఎక్కువయ్యాయి. మరి అవి వాడితే వచ్చే అనర్థాలు ఎటువంటివో!! అనాస పండులోని 'ప్రత్యేక' పదార్థాల ద్వారా కొవ్వు కరిగించుకోవచ్చంటే నమ్ముతారు. అసలేంటో తెలీని 'నోనీ' జూస్‌నీ, కాస్త తెలిసిన కలబంద రసాన్ని సర్వవ్యాధి నివారిణి గానూ, సకల సౌందర్య సాధనంగానూ వాడేస్తారు. ఫలానా నూనెని తలకు రాసుకున్న తర్వాత చేతులు కడుక్కోపోతే అక్కడా వెంట్రుకలు మొలుస్తాయంటే నిజమనుకుంటారు. స్వతహాగా వచ్చిన నలుపు చర్మాన్ని తెల్ల బరుచుకునేందుకు అత్యంత ధనవంతుడైన మైకేల్ జాక్సన్ అంతటి వాడు కూడా సౌందర్య సాధనాలకు వాడలేదు. అవి ఎలానూ ఉపయోగపడవని తెలిసి ఏకంగా చర్మ మార్పిడే చేయించుకున్నాడు. మనకు మాత్రం ఇవేమీ చెవికెక్కడం లేదు! అదీ విషాదం.

★

కథ

జ్ఞానోదయం

- రావుల కిరణ్మయి

"తమ్ముడు వచ్చినట్టున్నాడు. నే వెళ్తాను వాసంతీ. అయినా... మళ్లీ వస్తాలే" అంటూ పక్కింటి శారదక్క తను అంత వరకు చూపిస్తున్న చీరలను కవర్లలో సర్దుకుని వెళ్లిపోతుండగా

"ఏంటక్కా? వెళ్లిపోతున్నావ్!" అన్నాన్నేను గుమ్మంలోకి అడుగుపెడుతూ.

మీ బావగారు కూడా నీతోపాటే వచ్చి ఉంటారు కదా తమ్ముడు. అందుకే వెళ్తున్నా" అని చెప్పి వెళ్లిపోయింది.

"వాసంతీ! అక్క ఏవో చీరలు తెచ్చినట్టుంది!?" అడిగాను మొహం కడుక్కుని టీ తాగుతూ.

"అవునండీ! నేను మీకు నిన్న చెప్పాను కదా! ఉగాది లోపు అక్కాచెల్లెళ్లు ఒకరికొకరు చీరలు పెట్టుకోవాలట. శారద వదిన వాళ్ల ముగ్గురు అక్కలకి చీరలు తీసుకొచ్చిందండి" అంది చిన్నారికి తాగించడానికి రెండు గ్లాసుల్లో పాలు తిరగబోస్తూ.

"అవునా? మరి నువ్వు కూడా తీసుకోవాలన్నావుగా. శారదక్కతో వెళ్లి తీసుకోకపోయావా?" అన్నాను టీ తాగిన కప్పు కిందపెడుతూ.

"అమ్మో! వాటి రేటు ఎంతనుకున్నారు? ఒక్కొక్కటి పన్నెండొందల పైనే ఉంది. షిమ్మర్ చీరలట. మెరుస్తున్నాయి. షాపువాళ్లు ఈ చీరలకి అక్కాచెల్లెళ్ల చీరలని పేరుపెట్టి బిజినెస్ చేసుకుంటున్నారండీ" అంది.

"అయితే ఏమిటోయ్. మీ అక్క గౌరవానికి తగ్గట్టుండాలంటే నువ్వూ ఆ మాత్రం రేటు పెట్టి కొనాలి కదా" అన్నాను వాసంతిని చూస్తూ.

"ఎందుకండీ! మన ఆర్థిక పరిస్థితులు మా అక్కకి తెలియనివి కావు. పైగా తను అలా ఆలోచించే మనిషికాదు లెండి" అంది.

"మీ అక్క అనుకోకపోయినా, మీ బావగారు ఏమనుకుంటారో చెప్పు?" అన్నాను లేచి ఆమె వెనకే వంటింట్లోకి నడుస్తూ.

"ఇది అక్కాచెల్లెళ్లు ఒకరి దగ్గరకి ఒకరు వెళ్లి ఆప్యాయత పంచుకుని అరమరికలు ఏమైనా ఉంటే మర్చిపోయి కలిసిపోడానికి గానీ, ఆడంబరాలు ప్రదర్శించి అప్పుల పాలవడానికి కాదని నా అభిప్రాయం. సంప్రదాయాన్ని గౌరవిస్తూ మనకి కలిగిన దాన్లోనే ఓ మంచి చీర తీసుకుందామని అనుకుంటున్నాను. చేనేతవాళ్లు కూడా ఈ సందర్భంగా డిస్కౌంటు ఇస్తున్నారంటండీ. అందులోనే తీసుకుంటే రాబోయేది వేసవికాలమే కదా. తను రోజూ కట్టుకోడానికి బాగుంటుందనుకుంటున్నా" అంది.

మనకు జాగా (స్థలం) ఉన్నంతవరకే కాళ్లు చాపుకోవాలనే వాసంతి ఆలోచనకి, ఆమె మంచి మనస్తత్వానికి చాలా సంతోషమేసింది. బియ్యం ఏరుతున్న ఆమెకు కాస్త సాయంగా టమాటాలు కోసి ఇచ్చి, చిన్నారిని ఆడిద్దామని వెళ్లాను.

◆◆◆

వరంగల్ బయల్దేరిన వాసంతికి చాలా ఆనందంగా ఉంది. ఎన్నో రోజుల తర్వాత అక్కను చూడ్డానికి వెళ్తున్నందుకు ఎప్పుడెప్పుడు చేరుకుంటానా అని ఆమెలో ఆత్రం బస్సుకంటే వేగంగా పరుగెడుతోంది. వాసంతి అక్క వసుమతికి చెల్లెలంటే ప్రాణం. బావ సుధాకర్ కూడా మంచివాడే. కానీ లంచాలు పుచ్చుకుంటూ అక్రమంగా పెంచుకున్న ఆస్తి, హోదాతో పాటే అతనిలో అహంకారం కూడా పోగుపడింది. ఆ అహంకారమే మునుపటిలా అక్కాచెల్లెళ్లని కలుసుకోనివ్వకుండా దూరం పెంచేసింది. ఎప్పుడో ఒకసారి ఫోన్ పలకరింపు తప్ప ఒకరింటికి ఒకరు వెళ్లడం ఈ మధ్య కాలంలో చాలా అరుదైపోయింది. ఫోను సంభాషణల్లోనూ ఎక్కువగా బావగారి అక్రమార్జన గురించే ఆందోళన చెందుతుంది. ఆమె మాటలను బట్టి అక్క చాలా దిగులు పడుతోందని ఊహించింది. ఎలాగైనా ఒకసారి చూసొస్తే బాగుండని అనుకుంటున్న సమయంలో సంప్రదాయం కల్పించిన చీరల అవకాశం వాసంతిని గాల్లో తేలిపోతున్నంత ఆనందాన్ని, ఉక్కిరి బిక్కిరి అయ్యేంత హాయిని కలిగిస్తోంది.

◆◆◆

వరంగల్ చేరుకోగానే ఆటో మాట్లాడుకుని ఇంటి ముందు దిగింది. గేటు తీసుకుని లోపలికి నడిచింది. కాఫీ తాగుతూ పేపర్ తిరగేస్తున్న సుధాకర్ వాసంతిని గమనించి "వాసంతీ! ఇదేనా రావడం. బాగున్నావా? ఒక్క ఫోన్ చేస్తే కారు పంపేవాణ్ని కదా! ఆటోకి డబ్బు వృధా" అన్నాడు పాపను ఒళ్లో కూర్చోబెట్టుకుంటూ.

'వృధా' అన్న తీరులో ఏదో తేడా ఉంది. కానీ అదేమీ పట్టించుకోకుండా "బాగున్నాను బావా" అంది.

"కూర్చోమ్మా వాసంతీ" అని "వసుమతీ... వసూ.. అంటూ భార్యని పిలిచాడు. వంట పనిలో ఉన్న వసుమతి గరిటెతో సహా వచ్చి "ఏంటండీ!" అనబోయి వాసంతిని చూసి ఒక్కసారిగా ఆశ్చర్యానందాలతో ఉక్కిరిబిక్కిరైంది. గరిటె టేబుల్ మీద పెట్టి చెల్లెల్ని గట్టిగా హత్తుకుని "ఎలా ఉన్నావురా? ఒక్కదానివే వచ్చావేం? రాఘవను కూడా రమ్మనలేకపోయ్యావా?" అంటూ ఏగబిగిన అడిగేసింది.

వాసంతికి ఆ ఆలింగనంలో చిన్ననాడే దూరమైన తల్లి స్పర్శ కనిపించింది. నెమ్మదిగా "మేమంతా కులాసాగానే ఉన్నాం. నువ్వెలా వున్నావక్కా" అంది.

"చూస్తున్నావు గదరా. బాగానే ఉన్నాను. అరె... చిట్టితల్లి ఎంత చిక్కిపోయింది?!" అంటూ సుధాకర్ ఒడిలోని చిన్నారిని ఎత్తుకుంది.

"అవును మరి. పొద్దస్తమానం ఏదో ఒకటి తిని టీవీతో కాలక్షేపం చేస్తే తనుకూడా నీలాగే ఉండేది. కానీ ఏం చేస్తాం? పాపం ఆ రెండూ లేవు కదా!" అన్నాడు సుధాకర్ అదోలా నవ్వుతూ.

"చూశావురా! ఇదీ వరుస. రోజుకోసారైనా నేను లావుగా ఉన్నానని అనందే ఆయనకి నిద్రపట్టదు. ఇది మాకు మామూలే గానీ, అంతదూరం నుండి వచ్చావు. పద విశ్రాంతి తీసుకుందువుగానీ" అంటూ లోపలకి తీసుకెళ్లింది.

తర్వాత వాసంతికి కాఫీ, పాపకి బ్రెడ్డు జాము తెచ్చి ఇచ్చింది.

"అక్కా! పనిమనిషి రాజమ్మ రాలేదా? లేకుంటే మాన్పించావా? అంది కాఫీ తాగుతూ యథాలాపంగా.

"లేదురా. ఊర్నుండి వాళ్ల చెల్లెలు చీర తెచ్చిందట. అందుకని ఈ పూట రానని చెప్పింది" అంది చిన్నారికి బ్రెడ్డుమీద జామ్ రాస్తూ.

"నేనూ కూడా ఆ పనిమీదే వచ్చానక్కా. ఈ రోజు సాయంత్రం బావను కాస్త తొందరగా వచ్చేయమని చెప్పవా" అంది కాఫీ కప్పును లోపలికి తీసుకెళ్తూ.

"అలాగా! మరి ఇటువంటి సందర్భానికి రాఘవ కూడా వస్తే బావుండేది కదా" అంది వసుమతి.

"నీదంతా చాదస్తం కాకపోతే రాఘవకు ఎప్పుడంటే అప్పుడు సెలవులు దొరకడానికి అతనేమైనా పర్మినెంటు ఉద్యోగనుకున్నావా? ఎంతో కొంత డబ్బులు ఏర్పాటు చేసుకుంటే నేనెలాగో ఆ కంపెనీ ఎం.డి తో మాట్లాడి పర్మినెంటు చేయిస్తానంటే వింటాడా? ఎన్నిసార్లు చెప్పినా ప్రయోజనం లేదు. నీతికి కాలమా ఇది? రాఘవ తర్వాత చేరిన వాళ్లందరూ పర్మినెంటై ప్రమోషన్లు కూడా పొందారు" ఆఫీసుకు వెళ్లబోతూ అన్నాడు సుధాకర్.

"ఆ డబ్బే ఉంటే ఈ అవస్థలెందుకండి?" అంది వసుమతి.

"ఏం? నాతో చెప్పి 'నువ్వే ఏదైనా చెయ్యన్నయ్యా' అంటే చేసేవాణ్ని కాదా? అది కాదు సంగతి. అసలు లంచం పెట్టడం ద్వారా వచ్చే హోదా అతనకి ఇష్టం లేదట!" అన్నాడు వాసంతిని చూస్తూ వ్యంగ్యంగా.



వాసంతి ఏమీ మాట్లాడలేదు. ఏమీ విననట్లే అక్కడే ఉన్న అక్కవాళ్ల ఫ్యామిలీ ఫొటో చూస్తూ ఉండిపోయింది. అన్నీ తెలిసి దాన్నెందుకు అడుగుతారు కానీ, సాయంత్రం మీరు త్వరగా వచ్చేయండి. వాసంతి నాకు ఇవాళే అక్కాచెల్లెళ్ల చీర కట్టిస్తుందట" అంది.

"సారీ వసూ. ఈరోజు ఒక టెండర్ అగ్రిమెంటు చేయాల్సి ఉంది. సాయంత్రం వీలు కాదు" అంటూ వసుమతికి మారు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా వెళ్లిపోయాడు సుధాకర్.

◆◆◆

మరుసటి రోజు ఉదయమే వాసంతి అక్కకు కొత్తచీర కట్టించింది. నచ్చిన కలర్ కాంబినేషన్‌లో ఉండడంతో ఎంతో మురిసిపోయింది వసుమతి. ఆ సంతోషంలోనే "ఏమండీ! వసుమతి తెచ్చిన కొత్తచీర కట్టుకున్నాను. ఈ చీర నాకెలా ఉందండి?" అంది చీర సవరించుకుంటూ.

సుధాకర్ చీర వంకా, వసుమతి మొహం వంకా మార్చి మార్చి చూసి నిర్లిప్తంగా "హు ... అటు చూడు మన పనిమనిషి రాజమ్మ కట్టిన చీరే దీనికంటే బాగుంది" అన్నాడు రాజమ్మని చూపిస్తూ.

ఆ మాటలు వసుమతితోనే అంటున్నా తోటలో పూలు కోస్తున్న వాసంతి చెవిన పడ్డాయి. బావగారి మాటలతో గుండెల్లో ముల్లు గుచ్చుకున్నంత బాధ కలిగిందామెకు. అందుకే వచ్చిన పని పూర్తయింది కాబట్టి మధ్యాహ్నం బయల్దేరితే బాగుంటుందనుకుంది.

"అలా మాట్లాడకండి ప్లీజ్! ఈ చీర కొనడానికి రాఘవ ఐదు రోజులు అదనంగా నైట్ డ్యూటీ చేశాడట. ప్రేమతో ఇచ్చినదాని గురించి అంత చులకనగా మాట్లాడకండి. వాసంతి వింటే బాధపడుతుంది" కాస్త కటువుగానే చెప్పి చిన్నారికి టిఫిన్ తినిపిద్దామని హాల్లోకి వచ్చింది.

వాసంతి కనకాంబరాలు కోసి హాల్లోకొచ్చేటప్పటికి వసుమతి చిన్నారికి టిఫిన్ తినిపించడం పూర్తయి, మంచినీళ్లు తాపి కొంగుతో మూతి తుడుస్తోంది. అది చూసిన వాసంతి బావ ఎలా ఉన్నా అక్కలో అదే మునుపటి ఆత్మీయత. ఎంతైనా తమది ఒకే రక్తం కదా! అని ఆనందపడింది.

"అక్కా! మధ్యాహ్నం ఊరెళ్తాను" అంది మెల్లగా పూల మాల కడుతూ.

"అదేమిట్రా... ఈరోజు, రేపు ఉంటే బావగారు అలా సరదాగా రామప్ప, పాకాల చెరువు దగ్గరికి వెళ్దామంటున్నారు" అంది.

"లేదక్కా! ఈ నెల్లోనే చీర పెట్టాలంటే వచ్చాను. రాఘవకి ఇబ్బందౌతుంది. రాఘవ కూడా మిమ్మల్ని చూడాలంటున్నారు. ఎలాగూ పరీక్షలయ్యాక సెలవులకి వాసుకి, చైతన్య హాస్టల్ నుండి వస్తారుగా. అప్పుడు వీలు చేసుకుని అందరం వస్తాంలే" అంది ఖచ్చితంగా వెళ్లిపోడానికి నిర్ణయించుకున్నట్లు.

"వాసంతీ! ఈ ఒక్కరోజు ఉండమ్మా. మీ అక్కయ్య కూడా నీకు చీర పెట్టాలిగా. రేపొద్దున కట్టుకుని వెళ్దూగానిలే" అన్నాడు మధ్యాహ్నం భోజనానికి వచ్చిన సుధాకర్? బావగారు అలా అనేసరికి ఇంకేం మాట్లాడలేక పోయింది వాసంతి.

"వసూ... రామారావేమైనా డబ్బు తెచ్చాడా?" అడిగాడు భోజనం చేస్తూ.

"లేదండీ" అంది.

భోజనం చేసి తన గదిలోకి వెళ్తున్న సుధాకర్‌ని "ఆఫీసుకి వెళ్లడం లేదా?" అడిగింది.

"లేదు వసూ... నిన్న అగ్రిమెంటు చేసిన వాటి తాలూకు డబ్బు కాంట్రాక్టర్ల దగ్గర వసూలు చేసుకుని రావుగారు వస్తానన్నారు. అందుకే వెళ్లడం లేదు" అని చెప్పి తన గదిలోకి వెళ్లాడు.

వసుమతి వాసంతిని భోజనానికి పిలుద్దామని వెళ్లే సరికి చిన్నారిని జోకొడుతూ పేపర్ చదువుతోంది వాసంతి.

"వాసంతీ! రారా భోజనం చేద్దాం" అని రెండు సార్లు పిలిచినా పేపర్‌లో లీనమైన వాసంతి పలకలేదు. ఇంత సీరియస్‌గా ఏం చదువుతోందని పేపర్‌లోకి తొంగి చూసింది. అన్నా హజారే అవినీతి పోరాటానికి మద్దతుగా పత్రికలో వచ్చిన వ్యాసం. వాసంతికి ఇలాంటివంటే బాగా ఆసక్తి.

తను కూడా మొదటి నుండి సుధాకర్‌తో అవినీతికి తలవంచొద్దని చెప్తున్నా అతను పెడచెవిన పెడుతున్నాడు. మరోమార్గం లేక సహనం వహిస్తోంది. ఆ సహనమే ఆమెను మరింత కృంగదీసి డిప్రెషన్‌కి గురిచేస్తోంది. లంచాలు తీసుకోవద్దని, ఏనాటికైనా అవమానపడాల్సి వస్తుందని ప్రాధేయపడింది. దానికి అతను తేలిగ్గా నవ్వేస్తూ "పిచ్చిదానా! అలాంటి పరిస్థితే వస్తే మళ్లీ ఇలాగే లంచంతో తప్పించుకుంటాను. ఇదొక సైకిల్ సిస్టమ్. అవకాశం ఉన్నప్పుడే సంపాదించుకోవాలి" అని చెప్పాడు.

చదవడం పూర్తిచేసిన వాసంతి ఆలోచనలో మునిగిపోయిన అక్కను "ఏంటక్కా! అంతగా ఆలోచిస్తున్నావు?" అనడిగేసరికి వసుమతి కళ్లనిండా నీళ్లు.

"ఏం చెప్పమంటావు వాసంతీ! మీ బావగారు అవినీతికి పాల్పడుతూ డబ్బు సంపాదించడం ఎంత వరకు న్యాయం చెప్పు? మంచి జీతం వస్తున్నా అసలు కంటే వడ్డీ ముద్దన్నట్లు ఈమధ్య భారీగా లంచాలు తీసుకుంటున్నారు. అక్రమ సంపాదన ఎక్కువ కాలం నిలవదు. ఏదో ఒకరోజు ఎసిబి వల్లో చిక్కి, మీడియాలో లైవ్ షోలు, పత్రికల్లో ఫ్రంట్ పేజీల వార్తలు... ఇవన్నీ చూసి తట్టుకోవడం నావల్ల కాదురా. ఈ అపరాధభావంతో అన్నం కూడా సహించడం లేదు. ఎంత కుమిలిపోతున్నానో ఆయనకు చెప్పినా అర్థం కావడం లేదు. నా బాధ చెప్పుకుందామంటే పిల్లలు కూడా దగ్గర్లో లేరు. అప్పుడప్పుడు నీకు ఫోన్ చేసి చెప్పుకుని మర్చిపోవడానికి ప్రయత్నిస్తున్నాను" అంది ఉబికి వస్తున్న కన్నీళ్లను తుడుచుకుంటూ.

వాసంతి అక్కను ఓదారుస్తూ "ఇంత బాధని మనసులో ఉంచుకుని ఎలా ఉండగలుగుతున్నావక్కా. నాకు నీలా ఆస్తులు, ఆడంబరాలు లేకపోయినా ప్రేమ, ఆప్యాయత, ఆదరణ ఎక్కువేనని ఇప్పుడర్థమౌతోంది. మాకు వచ్చిన జీతంతోనే నిజాయితీగా బతుకుతున్నామనే సంతృప్తి ఉంది. అదే కోట్ల విలువజేసే ఆస్తి. ఏనాటికైనా బావలో మార్పు వస్తుందని ఆశిద్దాం. మనిషి ఆశావాది అయినప్పుడే జీవితం సంతోషంగా ఉంటుంది. నిరాశా నిస్పృహలకు తావివ్వకుండా నువ్వు కూడా ఆశావాదిగా మారాలి. ఇలా నీలో నువ్వే బాధ పడుతూ ఆరోగ్యాన్ని పాడుచేసుకోకు" అంది ఓదారుస్తూ.

◆◆◆

తెల్లవారింది. వసుమతి కూడా చెల్లెలికి చీర పెట్టింది. ఆ చీరను అందుకున్న చెల్లెలి చేతులు కొద్దిగా వణకడం గమనించి "ఇది మీ బావగారి అవినీతిలో భాగం కాదమ్మా. నా కష్టార్జితం" అంటూ చీరను దగ్గరుండి కట్టించింది. తర్వాత సుధాకరే స్వయంగా కారులో తీసుకొచ్చి హైదరాబాద్ బస్సెక్కించాడు. ఆ సాయంత్రం "క్షేమంగా చేరుకున్నారా?" అని ఫోన్ కూడా చేశాడు.

మరో రెండు రోజులకు సుధాకర్ రాఘవకు ఫోన్ చేశాడు ఎలా వున్నారని. కుశల ప్రశ్నలయ్యాక వాసంతితో మాట్లాడుతూ "అమ్మా వాసంతీ! నువ్వు రావడం వల్ల మీ అక్క మనోవ్యధకు కారణం ఏంటో పూర్తిగా తెలిసింది. డబ్బుతో ఏదైనా చేయొచ్చనుకున్నాను. కానీ ఆ డబ్బు న్యాయబద్ధం కాకపోతే జీవితంలో ఏం కోల్పోవాల్సి వస్తుందో ఇప్పుడు అర్థమైంది. మీ అక్క మనసు క్షోభపెట్టి నేనేమీ సాధించలేనని తెలుసుకున్నాను. అందుకే ఇక అవినీతి సంపాదనకు ముగింపు చెప్తున్నానమ్మా. ఈసారొచ్చినప్పుడు నువ్వే చూస్తావుగా. ఇక వుంటానమ్మా!" అని ఫోన్ పెట్టేశాడు. వాసంతికి సుధాకర్‌లో ఈ మార్పు ఎలా వచ్చిందో తెలీదు. ఆ రోజు అక్కాచెల్లెళ్లిద్దరి మధ్య జరిగిన సంభాషణ సుధాకర్ విన్నాడని ఎవ్వరికీ తెలియదు. ఆయనలో కలిగిన జ్ఞానోదయానికి ఎంతో సంతోషించింది. అక్కాచెల్లెళ్ల చీరల సంప్రదాయం ఆ రెండు కుటుంబాలను చేరువ చేసినందుకు వాసంతి సంతోషానికి అవధుల్లేకుండా పోయింది. ★

చిత్రమైన మనుషులు విచిత్రమైన ప్రవర్తనలు

మన చుట్టూ రకరకాల మనుషులుంటారు. అందులో భాగంగా ఒక్కోసారి మనకు చిత్రమైన మనుషులూ తారసపడుతుంటారు. వారి ప్రవర్తన కూడా విచిత్రంగా ఉంటుంది. మరి అలాంటి చిత్రమైన మనుషుల విచిత్రమైన ప్రవర్తనలకూ కొన్ని పేర్లున్నాయి. అవేంటో ఈ వారం తెలుసుకుందామా!

\- సి.వి. సర్వేశ్వరశర్మ
ఫోన్ నెం: 9866843982
sarma.chavali@gmail.com

కొత్త సంవత్సరం, ఉగాది వంటి పండుగల పేరు చెప్పి పరిచితులందరికి తన స్థాయికి తగ్గరీతిలో బహుమతులు ఇస్తుంటారు. ఈ రకం పిచ్చినే 'డోరోమేనియా' అంటారు. తమ చేతిలో ఉన్న డబ్బును త్వరత్వరగా ఖర్చుపెట్టేస్తుంటారు. ఇతరులకు బహుమతులు ఇవ్వడంలో తప్పు పట్టాల్సిందేమీ ఉండదు. కానీ ఈ పని అతిగా చేస్తే ఆ మనిషికి 'మతి' తప్పినట్టేనని గ్రహించాలి.

ప్లియోనెక్సియా

కొంతమందికి డబ్బు పిచ్చి ఉంటుంది. ఈరకం మనుషుల దృష్టి ఎప్పుడూ డబ్బు ఎలా సంపాదించాలి? అనే విషయం మీదనే ఉంటుంది. మానవ సంబంధాలు, ఆప్యాయతలు, అనురాగాలు వీరికి పెద్దగా పట్టవు. ఇటువంటి పిచ్చిగలవారికి డబ్బు సంపాదించడం, దానిని కూడ బెట్టడమే తెలుస్తుంది. దానిని వినియోగించడం వారికి తెలియదు. ఇలా డబ్బు సంపాదించే పిచ్చినే 'ప్లియోనెక్సియా' అంటారు. ఈ పిచ్చిగలవారు తాము కూడబెట్టిన డబ్బును అనుభవించడం, ఇతరులకు కొంత దానం చెయ్యడం అలవరుచుకుంటే వారి మానసిక ఆరోగ్యం బాగుపడుతుంది.

కల్లోమేనియా

కొంతమంది గంటల తరబడి అద్దం ముందు కూర్చుని తమ అందాన్ని తనివితీరా చూసుకుంటూ ఉంటారు. తనంతటి అందగాడు/అందగత్తె మరొకరు ఉండరని భావిస్తూ అద్దం ముందు కాలక్షేపం చేస్తూ ఉంటారు. ప్రతి ఒక్కరు తాము అందంగా వున్నాం అనుకుంటారు. అలా అనుకోకపోతే బతకలేరు. కానీ సమాజంలో తామొక్కరమే అందరికన్నా అందంగా వున్నామనే భ్రాంతిలో ఉండే పిచ్చినే 'కల్లోమేనియా' అంటారు. ఇటువంటి వారు మనకు తరచూ తారసపడుతుంటారు. వారి ఆలోచనలు, మాటలు ఎప్పుడూ అందం గురించే ఉంటాయి.

మెయిన్ సింద్రోమ్

తాము ప్రత్యేకమైన వ్యక్తులుగా కొంతమంది ఫీలవుతూ ఉంటారు. పదిమందిలో ఉన్నప్పుడు అందరూ తనను చూడాలనే ఆలోచనతో గట్టిగా మాట్లాడుతుంటారు. రాజకీయంలో ఉండే వ్యక్తులయితే తెగ స్టేట్‌మెంట్లు ఇస్తూ, అందరి దృష్టిని ఆకర్షిస్తుంటారు. ఈ మానసిక రోగం గలవారు ఏదైనా అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరితే ఇతర రోగులతో తనది చాలా ప్రత్యేకమైన రోగమని, డాక్టర్ తన రోగం నయం చేయడం ఒక ఛాలెంజ్‌గా తీసుకున్నాడని ప్రచారం చేసుకుంటుంటారు. స్పెషలిస్టు డాక్టర్ తనకు బాగా సన్నిహితుడని, అతనితో ఏ విషయమైనా తాను ఈజీగా మాట్లాడగలనని చెప్పుకుంటుంటాడు. ఈ రకమైన పిచ్చినే 'మెయిన్ సింద్రోమ్' అంటారు.

చిన్నతనంలో తల్లిదండ్రులు లేదా ఇతరుల నుండి తాము పొందలేకపోయిన ప్రేమానురాగాలు, ఆప్యాయతలు ఈ రకంగా ఇతరులతో తమకు సన్నిహిత సంబంధాలున్నాయని అనుకోవడం ద్వారా పొందుతున్నామనుకుంటారు ఇటువంటి వ్యక్తులు.

స్టీరియోటైపీస్

సమాజంలో కొంతమంది విచిత్రమైన వ్యక్తులు మనకు ఎదురవుతుంటారు. వారు మాట్లాడే ప్రతి మాటకు చివర ఒక ఊతపదం ప్రయోగిస్తుంటారు. అందరూ ఒకేరకంగా ఊతపదాలను వాడరు. 'నేను మొదటి ఆట సినిమా రిలీజ్ రోజునే వెళ్తాననేసరికి మాష్టారు డంగైపోయారు. మొదటి ఆట సినిమా టిక్కెట్ చూపించేసరికి మళ్లీ డంగైపోయారు. సినిమా హాలు దగ్గర ఆ జనం మధ్య నన్ను చూసి దెబ్బకు డంగైపోయారు' ఇలా ఉంటుంది కొంతమంది సంభాషణ.

'నేను ప్రిన్సిపల్ దగ్గరకు వెళ్లేసరికి అతనికి మతి పోయింది. మావాడి గురించి రెండు పాయింట్లు చెప్పేసరికి ప్రిన్సిపల్‌కి మతిపోయింది. మావాడిని క్లాసుకు పంపాను. దెబ్బతో ప్రిన్సిపల్‌కు మతిపోయింది' ఈరకమైన సంభాషణ చేస్తుంటారు కొందరు. అంతేకాదు, కొంతమంది మాట్లాడుతుంటే నిరంతరం చేతులు తిప్పుతూ మాట్లాడుతుంటారు. మరికొంతమంది మాట్లాడినంతసేపూ తలాడిస్తూనే ఉంటారు. ఇంకొందరు మాట్లాడినంత సేపు కాళ్లాడిస్తుంటారు. ఈ విధంగా ఊతపదాలు, ఊత చేష్టలతో మనుషుల ప్రవర్తన ఉంటే ఆ వ్యవహారాన్ని 'స్టీరియోటైపీస్' అంటారు. 'స్కిజోఫెనియా'వ్యాధి గలవారిలోనూ, మామూలు వ్యక్తులలోనూ ఇటువంటి వ్యవహారం ఉంటుంది.

పగటికలలు

కొంతమంది నిరంతరం పగటి కలలు కంటూ ఉంటారు. ఎప్పుడూ ఆలోచనలు, ఊహల్లో తేలిపోతుంటారు. తరచూ తమ ఉనికినే మరచిపోతుంటారు. వీరి పగటి కలలు ఎలా ఉంటాయంటే పది రూపాయలు పెట్టుబడి పెట్టి లాటరీ టికెట్ కొంటారు. దానికి లక్ష రూపాయల లాటరీ తగులుతుంది. లక్షరూపాయలు వడ్డీ వ్యాపారంలో పెడతాడు. మూడు సంవత్సరాల్లో అది కాస్తా కోటి రూపాయలవుతుంది. కోటి రూపాయలతో బడ్జెట్ సినిమా తీస్తాడు. అది హిట్ అవుతుంది. లాభాలే లాభాలు. వరుసగా అయిదు సినిమాలు తీసేసరికి జనంలో పాపులారిటీ బాగా పెరిగిపోతుంది. ఇంతలో రానే వస్తాయి ఎలక్షన్లు. పార్టీ టికెట్ ఇవ్వకపోయినా ఇండిపెండెంట్‌గా నిలబడతాడు. తనమీద జనానికున్న క్రేజ్‌వల్ల తనను ఎన్నుకుంటారు. ఎమ్.ఎల్.ఎ అవుతాడు. అధికార పార్టీలో చేరిపోతాడు. ఇంకేముంది మంత్రిపదవి ఖాయం. ఈ విధంగా పగటి కలల్లో మునిగి తేలిపోతుంటాడు. ఇటువంటి స్థితిలో ఉండడాన్ని 'ఆటిస్టిక్ థింకింగ్' అంటారు. ఇలాంటి పగటి కలలు ఎప్పుడైనా ఒకసారి కంటే పర్వాలేదు. తరచూ ఇటువంటి పగటి కలలు కంటూ ఉంటే ఆ వ్యక్తికి 'స్కిజోఫెనియా' వ్యాధి లక్షణాలు ఉన్నాయని గ్రహించాలి. మానసిక వైద్యుని దగ్గరికి తీసుకువెళ్లి చికిత్స చేయించడం మంచిది.

★

చదవాల్సిన పుస్తకం

ప్రస్తుతం మనం పెట్టుబడిదారీ యుగంలో వున్నాము. అది ప్రజాస్వామ్యమనే అందమైన ముసుగు తగిలించుకుంది. పెట్టుబడిని పోగేసుకోవటం, లాభాలు దండుకోవటం దాని లక్ష్యం. అందుకు ఎన్ని అడ్డదారులైనా, ఎంతటి మారణహోమమైనా అది సృష్టించగలదు. ఎంతటి క్రూరమైన అణచివేతకైనా అది పాల్పడుతుంది. దానికి జాక్ లండన్ పెట్టిన చావగల పేరు 'ఉక్కుపాదం'. మామూలుగా ప్రజలకు కనిపించని విషయాలను ఆలోచించగల నిర్దిష్ట ప్రతిభ, భవిష్యత్తును ముందుగా ఊహించి చెప్పగల పరిజ్ఞానం జాక్ లండన్‌కు వున్నాయి. ప్రస్తుత పెట్టుబడిదారీ విధానానికి నాయకత్వం వహిస్తున్న అమెరికాలో వందేళ్ళ కిందటి, నేటి వాస్తవాలకు నవలారూపమే ఈ ఉక్కుపాదం. ఇందులో కథానాయకుడు ఎర్నెస్ట్ ఎవర్ హర్డ్ సోషలిస్టు. అమెరికన్ కార్మికవర్గ ప్రతినిధి. కార్మికోద్యమాన్ని అణచడంకోసం అమెరికన్ పెట్టుబడిదారీ వర్గం ఏ విధంగా వ్యవహరించింది ఈ నవల ద్వారా మనం కళ్ళకు కట్టినట్లు గమనించగలం. కథానాయిక ఎలిన్ ఇంట్లో ఒక విందు సమావేశంతో నవల ప్రారంభమవుతుంది. అక్కడ పెట్టుబడిదారీ సమాజంలోని వివిధ వర్గాల ప్రతినిధులతో ఆసక్తికరమైన చర్చ సాగుతుంది. "మీరు వర్గ వైషమ్యాలను రెచ్చగొడుతున్నారు. కార్మికవర్గంలో వుండే సంకుచిత తత్వాన్ని, మూర్ఖత్వాన్ని, మీరు దానికోసం వాడుకోవడం తప్పుగా, నేరంగా భావిస్తున్నాము. వర్గద్వేషం, సామాజిక ద్రోహం, సామ్యవాద వ్యతిరేకమని నేను అనుకొంటున్నాను" అని ఒక చర్చి బిషప్ అన్న మాటలకు ఎవర్‌హర్డ్ సమాధానం సూటిగా చెప్తాడు. "వర్గద్వేషం వేరు. వర్గ పోరాటం వేరు. మేము ఏ ద్వేషమూ రెచ్చగొట్టటం లేదు. వర్గపోరాటమనేది సామాజిక పరిణామ సూత్రమని చెప్తాము. దానికి మేము బాధ్యులము కాదు. వర్గ పోరాటాన్ని మేము తయారు చేయలేదు. న్యూటన్ మహాశయుడు గురుత్వాకర్షణ శక్తిని గురించి చెప్పిన మాదిరిగా మేము వర్గపోరాటాన్ని గురించి చెప్తున్నాము. వర్గపోరాటాన్ని సృష్టించే కారణాల స్వభావాన్ని గురించి మేము వివరిస్తాము". అంటాడు. అంతేకాదు. ప్రస్తుత పెట్టుబడిదారి సమర్థకులు చేస్తున్న వాదనలన్నింటినీ తిప్పికొట్టాడు. చర్చి ఏ విధంగా దోపిడీని సమర్థిస్తుందో కూడా వివరిస్తాడు. "పాతుకుపోయిన సామాజిక వ్యవస్థను పదిలంగా కాపాడటమే చర్చి చేస్తున్న పని. కార్మికవర్గంపై పెట్టుబడిదారీ వర్గం పెట్టే క్రూర భయంకర హింసాకాండను చర్చి క్షమిస్తోంది. చర్చి దాన్ని నిరసించదు. చర్చి దాన్ని నిరశించనంత వరకు ఆ అమానుషత్వాన్ని క్షమిస్తున్నట్లే లెక్క". ఎవర్‌హర్డ్‌ను ప్రేమించిన ఎలీనా ఇంట్లో ఒకసారి మరో చర్చ సాగుతుంది. అప్పుడు "మీరు తొడుక్కున్న గౌనుకు నెత్తురు మరక అంటుకున్నది. మీరు తింటున్నది నెత్తుటి కూడు. మీ ఇంటి దూలాల నుండి ముక్కుపచ్చలారని పిల్లలు, దిట్టంగా వుండే పెద్దవాళ్ళ రక్తం బొట్టుబొట్టు కురుస్తున్నది" అంటాడు. ఆ మాటకు కలవరపడిన నాయిక తమ సొంత పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో పూర్తిగా చేతిని కోల్పోయిన జాక్సన్ అనే కార్మికుడి స్థితిగతులను పరిశీలిస్తుంది. అతనికి నష్టపరిహారం రాకుండా తమ కంపెనీ, కోర్టులు ఎంత అమానుషంగా వ్యవహరించింది తెలుసుకుంటుంది. ఎవర్‌హర్డ్‌ను ఇష్టపడుతుంది. చివరి వరకు అతనితో నిలిచి వుంటుంది. ఎవర్‌హర్ట్ శాసనసభకు పోటీచేయబోయే ముందు చిన్న పెట్టుబడిదార్లతో ఒక సమావేశం జరుగుతుంది. అందులో చిన్న పెట్టుబడిదార్ల అనివార్య నాశనం గురించి, అర్థశాస్త్రం గురించి చర్చ సాగుతుంది. "శ్రమశక్తి, పెట్టుబడి కలసి 100 డాలర్ల సరుకులు సృష్టించాయి అనుకుంటే కార్మికులకు చేరేది జీతాలరూపంలో 50 డాలర్లే. మిగిలిన 50 డాలర్ల సరుకు కొనుగోలు కాకుండా మిగిలిపోయి వలసలు సృష్టిస్తుందో, ప్రపంచమంతటా సరుకుల అమ్మకం ఏవిధంగా అల్లుకుంటుందో చూస్తే పెట్టుబడిదారీ విధానం అనివార్య పతనం జరుగుతుందని" ఎవర్‌హర్ట్ వివరిస్తారు. "పెట్టుబడిదారీ వ్యవస్థ అనివార్య పతనాన్ని నేను లెక్కలతో సహా మీ ముందు ప్రదర్శించాను. ప్రతి దేశం ఖర్చుకాని మిగులు నిల్వలతో, అమ్ముకొనే జాగా దొరక్క అలమటించినప్పుడు పెట్టుబడిదారీ వ్యవస్థ తనంతట తాను కట్టుకున్న లాభాల భయంకర కట్టడం క్రింద కూలిపోతుంది". అని రచయిత దృఢ విశ్వాసంతో ప్రకటిస్తాడు. అమెరికన్ పెట్టుబడిదారీ విధానం లో వుండే దోపిడీ, రైతాంగాన్ని, చిన్న పెట్టుబడిదార్లను గుత్తపెట్టుబడిదారీ విధానం ఏ విధంగా నాశనం చేస్తున్నది ఈ రచన వివరిస్తున్నది. దోపిడీకి గురౌతున్న కార్మికవర్గం సంఘటితం కాకుండా వుండేందుకు ఎంతటి మారణహోమానికి, అణిచివేతకు పెట్టుబడిదారీ విధానం సిద్ధమౌతుందో జాక్ లండన్ ప్రతిభావంతంగా వివరించాడు. దానికి అతనిచ్చిన ప్రతిభావంతమైన పేరు "ఉక్కుపాదం". "అప్పుడు మానవచరిత్ర పుటలను మలినం చేసిన అన్ని నిరంకుశ ప్రభుత్వాల మాదిరిగానే ఇక్కడా ఆ భయంకర నిరంకుశ ప్రభుత్వపు ఉక్కుపాదం కార్మికులందర్నీ నిర్దాక్షిణ్యంగా కొట్టిపారేస్తుంది" అని వర్గపోరాట తీవ్రతను గురించి ఎవర్‌హర్ట్‌పాత్రద్వారా రచయిత లోకానికి చాటాడు. అచంచల విస్వాసంతో ఇలా ప్రకటించాడు. "ఉక్కుపాదానికి రోజులు మూడాయి. పీడిత మానవాళికి దూరంగా ఆ ఉక్కుపాదాన్ని విసిరి పారేసే రోజులు దగ్గరపడ్డాయి. ప్రపంచ శ్రామికులంతా ఒక్క పెట్టున విజృంభిస్తారు. శ్రామిక ప్రజల సమైక్యతకు ఇక తిరుగులేదు. సువిశాల ప్రపంచ పర్యంతమైన ఒక మహా అంతర్జాతీయ విప్లవం జరుగుతుంది". గతంలో హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ వేసిన ఈ ఉక్కుపాదాన్ని ప్రజాశక్తి బుక్‌హౌస్ పునఃముద్రణ చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని అభ్యుదయవాదులు, ముఖ్యంగా కార్మికవర్గం తప్పనిసరిగా ఈ పుస్తకాన్ని చదవాల్సిన అవసరం వుంది.

ఉక్కుపాదం, వెల : 60/-, పేజీలు:176 , ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్, 1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20.

- కారుసాల

కొత్త పుస్తకాలు

చందమామ రావే

డా॥ పత్తిపాక మోహన్

వెల : 50/-

పేజీలు : 60

ప్రతులకు :

సెక్రటరీ, మారసం

5-4-47, పత్తిపాక వీధి

సిరిసిల్ల - 505301

పౌరుష జ్యోతి

శ్రీ కృష్ణారావు

వెల : 40/-, పేజీలు : 78

ప్రతులకు :

కొల్లా శ్రీ కృష్ణారావు

ఎడిటర్ 'భావవీణ'

రోహిణీ టవర్స్

2/11, బ్రాడీపేట

గుంటూరు.

పైకి చేరేదెలా!

బుజ్జాయిలూ...చూడండి! ఆ బుల్లి హీరో జండా దగ్గరికి వెళ్లాలంట. దారి చాలా తికమకగా ఉందని సాయం అడుగుతున్నాడు. మరి మీరేదైనా మార్గం ఆలోచిస్తారా?!



చెప్పుకోండి

హాయ్... పక్కనున్న పిడుగు ఎవరో తెలుసా? మీకు చిన్న క్లూ కూడా ఇస్తున్నాం. ఇతనో క్రికెట్ స్టార్. ఇంకా చెప్పుకోవాలంటే బెంగాలీ వాడు. కాకపోతే చిన్ననాటి ఫొటో ఇది. ఇప్పుడు చెప్పండి ఇతను ఎవరో?

జవాబు : గంగూలీ

దురాశ

అనగనగా ఒక పేద బ్రాహ్మణుడు. అతను చాలా దురాశ కలవాడు. ఒకసారి అతను పనిమీద ఒక అడవిలో నుండి వెళ్తున్నాడు. మధ్యలో నీటిమడుగు అడ్డం వచ్చింది. ఆ మడుగు అవతల ఒక చిన్న గుహ వుంది. గుహ ముందు కూర్చున్న పులిని చూసేసరికి బ్రాహ్మణుడికి పై ప్రాణాలు పైనే పోయాయి. ఆ మడుగులో నీళ్ల మోకాలిలోతే వున్నాయి.

పులి చాలా ముసలిది. దానికి నడవడానికి కూడా శక్తిలేదు. బ్రాహ్మణుణ్ణి చూసి చెయ్యెత్తి పిలిచింది. దాని చేతిలో ఒక బంగారు గాజు మెరుస్తూ వుంది.

"ఓ బ్రాహ్మణుడా! నన్ను చూసి భయపడకు. నేనొక వృద్ధ పులిని. కదలలేను. మెదలలేను. నాకు చానాళ్ల క్రితం ఈ బంగారు గాజు దొరికింది. దీనిని ఎవరికన్నా ఇద్దామనుకుంటే నన్ను చూసి భయపడి ఎవరూ నా దగ్గరకు రావడం లేదు. నేను హింస మానేసి, మాంసాహారం మానేసి పవిత్ర జీవితం గడుపుతున్నాను. ఈ గాజు తీసుకుని నాకు కొంచెం పుణ్యం వచ్చేలా చెయ్యి" అంది ప్రశాంతంగా.

మొదట బ్రాహ్మణుడు భయపడ్డాడు. కానీ బంగారుగాజు మీద ఆశ అతని భయాన్ని పోగొట్టింది. అడుగులో అడుగు వేసుకుంటూ ఆ పులి దగ్గరికి వెళ్లాడు. అంతే...! ఒక్కసారిగా అతనిమీదకి లంఘించి చంపి తినేసింది.

నీతి : దురాశ దుఃఖానికి చేటు

- మేకల మదన్‌మోహన్ రావు



ఎలాగబ్బా...!



ఒకటి నుండి వరుసగా ఏడు అంకెలు 1,2,3,4,5,6,7 ఇలా రాయండి. వాటి మధ్యలో కూడిక, తీసివేత, హెచ్చవేత, భాగాహారం గుర్తులు పెట్టి లెక్కచేస్తే 40 వస్తుంది. అది ఎలాగో చెప్పండి. మీకో క్లూ ఏంటంటే అంకెలను వరుసగానే వేయాలి. పైగా మీరు వాటిలో ఏ గుర్తులు ఏ అంకెలమధ్య వెయ్యాలో చూసుకుని లెక్క పూర్తిచెయ్యడమే.

వంద ఎలా?

వరుసగా తొమ్మిది అంకెలు 1,2,3,4,5,6,7,8,9 వేయాలి. వాటి మధ్యలో ప్లస్ గుర్తు కానీ మైనస్ గుర్తుగానీ ఆరు సార్లు పెట్టాలి. ఈ లెక్క చేస్తే మొత్తం 100 రావాలి. అయితే ఎక్కడెక్కడ ఏ గుర్తులు పెడితే వంద వస్తుందో చెప్పాలి. ఇవే అంకెలను ఇంకా తక్కువ సార్లు ప్లస్, మైనస్ గుర్తులను ఉపయోగించి కూడా ఈ లెక్క చేయొచ్చు. అదెలాగో చెప్పగలరా.



జవాబులు : ఎలాగబ్బా : 12/34-5+6-7=40. వంద ఎలా? : 12+3-4+5+67+8+9=100 లేదా 123+4-5+6-89=100



కె.తిరుపతి స్వామి
9వ తరగతి,
బి.సి హాస్టల్,
తాలూకా హైస్కూల్,
కొత్తపేట, తెనాలి.



చిలిపి

ఎలా ఉంది
నా హెయిర్ స్టైల్!?

గాలిలో జారిపోతుంటే...

విహంగం

ఈ వారం మనం చెప్పుకోబోయేది వాన కోవెల గురించి. ఇది పిచ్చుక సైజులో ఉంటుంది. దీనికి పైవైపు నీలం, నలుపు రంగులు కలిసిన ముదురు రంగులో, కింది భాగం లేత ఎరుపు, గోధుమ రంగులు కలిసినట్లు కనిపిస్తుంది. అంతేకాదు! దీనిమీద అక్కడక్కడా ముదురు గోధుమరంగు చారలు కూడా ఉంటాయి. అయితే అడుగు భాగాన ఎక్కువగా కనిపిస్తాయి. తమాషా ఏంటంటే... తోక రెండుగా చీలినట్లుంటుంది. ఎగిరేటప్పుడు ఈ చీలిక స్పష్టంగా కనిపిస్తుంది. ఈ పక్షుల్లో రెండు రకాలున్నాయి. కొన్ని వలసపోతాయి. మరికొన్ని ఎక్కడికీ వెళ్లవు. ఈ పక్షుల సమూహం ఎక్కువగా టెలిఫోన్ తీగలమీద బారులు తీరి కనిపిస్తుంది. ఇది ఒక్కోసారి నేలకు చాలా దగ్గరగా లేదా గాల్లో చాలా ఎత్తులో ఎగురుతుంది. ఈ పక్షి రెక్కలున్న కీటకాలను వేటాడుతుంది. ఇది గుడ్లు పెట్టే కాలంలో ఓరకం పక్షులతో, మిగతా కాలంలో మరో రకం పక్షులతో కలిసి ఉంటాయి. పగలంతా నీళ్ల మొక్కలపైనే దీని నివాసం. చెరకు తోటల్లో ఎక్కుగా నిద్రపోతుంది. ఈ పక్షి రెక్కలను టపటపా కొడుతూ వేగంగా చాలా ఎత్తుకు ఎగురుతుంది. అక్కడ రెక్కలను ఆడించడం ఆపేసి, గాల్లో అలా జారి కిందికి వస్తుంది. ఈ దృశ్యం చూడ్డానికి భలేగా ఉంటుంది. దీని గూటిని బురదతో రాతిగుహల్లో కట్టుకుంటుంది. దీని గుడ్లు బల్బు ఆకారంలో ఉంటాయి. వీటి రక్షణకోసం గూళ్లలో ఈకలనుంచుతుంది.



కనిపెడతారా!

నేస్తాలూ... పై బొమ్మలో కొన్ని వస్తువులు, తినుబండారాలు ఉన్నాయి. అవి ఎక్కడున్నాయో వెతికి పట్టుకోవాలి. వాటిలో ఎన్ని ఎక్కువ వెతికి పట్టుకుంటే అన్ని మార్కులు వచ్చినట్టు. మరి త్వరపడండి!

ఆరు తేడాలు ఏవోచ్?

పిల్లలూ... కిందున్న రెండు బొమ్మలూ చూడ్డానికి ఒకేలా ఉన్నాయా! కానీ వాటిలో ఆరు తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టి సున్నా చుట్టండే.

జవాబు : 1. ఎలుక తోక, 2. చెట్టు, 3. బ్యాగు క్లిప్పు, 4. చందమామ, 5. కిందున్న చిన్న రాళ్ళు, 6.పక్షి కిందున్న జంతువు కన్ను.

మాటల కోట - 55

రూపకల్పన : కర్లపాలెం

1		■	2	■	3	■	4	5
	■	6		7		8	■	
	■		■		■		■	
9		■	10		11	■	12	
■	■	13		■	14		■	■
15	16	■	17	18		■	19	20
21		22	■		■	23		
	■	24	25		26		■	
27		■		■		■	28	

అడ్డం :

1. నాపరాయి పరిచిన నేల (2)
4. బావినీరు చేదే సాధనం (2)
6. పురపాలక సంఘము (5)
9. స్వర్గలోక నర్తకి, సినీతార (2)
10. 'అనంతపురం'లో ఒక జనరేషన్ (3)
12. మన పొరుగు దేశం! అత్యధిక జనాభాకు పేర్గాంచిన దేశం (2)
13. దీర్ఘకాలిక అపస్మారక స్థితి (2)
14. అటునుండీ పెట్టే నస (2)
15. మనిషంటే ఇది లేని కోతి (2)
17. చందమామ (3)
19. అరవంలో 'అవును' అనూ (2)
21. గుర్రాలు లాగే ప్రాచీన వాహనం (3)
23. అతిగా పొగడటమంటే ఈ చెట్టు ఎక్కించడమే (3)
24. నివురు కప్పిన నిప్పు మీద ఆ కప్పినది ఊదేయండి! (5)
27. ఇదీ ఒక ముచ్చటే.... పసి బిడ్డలను చూడగానే... పెట్టుకోవాలనిపిస్తుంది (2)
28. కళ్లకైనా, కాళ్లకైనా ఉండే జత (2)

నిలువు :

1. చరిత్ర సాహిత్య పరిశోధకులు రామకృష్ణ శర్మగారి ఇంటిపేరు ఒక సమయ సూచిక యంత్రం (4)
2. లక్ష్మీబాయి ముందున్న మధ్యప్రదేశ్ పట్టణం (2)
3. ఆ వాలిపోయేవాడేనా సుగ్రీవుడి సోదరుడు (2)
5. మందులాసుపత్రి (4)
6. గులాబీ కొమ్మలో, గడియారంలో ఉండేది (2)
7. ధాన్యం దాచే నేల మాళిగ (3)
8. రోగనిరోధక ఇంజెక్షన్ - చిన్నపిల్లలకు ఇచ్చేది (2)
10. తిరగబడిన దశమగ్రహం (3)
11. వయోవృద్ధుడు కదా. ముడుచుకుపోయాడు (3)
15. గుమ్మాలకు వేలాడదీసే అలంకరణం (4)
16. కతే! (2)
18. చెదిరిన బిరుదు (3)
19. ఆనపకాయలో ఆజ్ఞ (2)
20. పురుషుడు (4)
22. పొట్టి మునీశ్వరుడు (2)
23. ప్రమాదం (2)
25. పిల్లి - ల్లిపి అయితే మ్యావు ఏమవుతుందో?(2)
26. ఖనిజంలోని సత్యం (2)

మాటలకోట - 54 జవాబు

1 తి	క్క	2 న	■	3 ష్ప	4 ఒ	■	5 జా	6 జి
తం	■	7 గ	డ్డి	■	8 క	లం	■	లే
■	9 రే	వు	■	10 కో	టి	■	11 బే	బి
12 కా	పు	■	13 మో	డి	■	14 తె	ర	■
క	■	15 ఓ	టు	■	16 స	ర	సా	లు
17 ర	18 మ	ణి	■	19 గి	రి	■	రా	■
■	ట్టి	■	20 న	న్నె	■	21 పు	లు	22 పు
23 జో	■	24 బా	వ	■	25 మొ	ల్ల	■	ష్య
26 గు	డు	బు	■	27 సి	గ్గు	■	28 ఆ	లు



మిత్రుని మాట

మస్తాన్‌కి మాంసం దుకాణం ఉంది. అతను నాలుగు కుక్కల్ని పెంచేవాడు. దుకాణం ముందు అవి ఎప్పుడూ తయారుగా ఉండేవి. మస్తాన్ కోళ్లు, మేకలు, వేటల్ని కోసేవాడు. అప్పుడు పనికిరాని పేగులు, గిట్టల వంటివి పారేస్తాడు. వాటిని ఆ కుక్కలు కాట్లాడుకుని తింటుండేవి.

ఒకరోజు మస్తాన్ తండ్రి చనిపోవడంతో దుకాణం తెరవలేదు. ఆ కొట్టు దగ్గర మాంసం తినడం అలవాటైన కుక్కలు మరో చోటికి పోవడానికి ఇష్టపడలేదు. అలా ఆ షాపుదగ్గరే ఎదురు చూస్తూనే ఉన్నాయి. 'ఇంకొంచెం సేపాగి తెరుస్తాడేమో, మరికొద్దిసేపటికి తెరుస్తాడేమో' అని ఆలోచిస్తూ కొట్టువైపు ఆశగా చూస్తున్నాయి. అలా చూస్తున్న కొద్దీ వాటికి ఆకలి రెట్టింపు అవుతోంది. చీకటి పడ్డా, రాత్రయినా... ఆషాపు తియ్యలేదు. మరుసటి రోజు కూడా మస్తాన్ రాలేదు. ఆ కుక్కలు ఆకలితో నకనకలాడిపోతున్నాయి.

అదే బజార్లో తెల్లమేక, నల్లమేక ఎప్పుడూ కలిసి తిరుగుతుండేవి. అవి రోడ్లమీద పడేసే అరటి తొక్కలు, పాడైపోయిన పండ్లు తినుకుంటూ ఉండేవి. దుకాణం దారు చూడకుండా అరటిపండ్లూ, జామపండ్లూ అందుకుని పరిగెత్తుతుండేవి. అవి నిత్యం బజార్లలోనే తిరుక్కుంటూ, రాత్రి పూట కొట్టు పున్నారావు ఇంటికి చేరేవి. ఆ రోజు ఆహారం వెదుక్కుంటూ మాంసం దుకాణం వైపు వచ్చాయి. దుకాణం ముందు పడుకున్న కుక్కల్ని చూశాయి. రోజు మాదిరిగానే ఆ బజారుకు వెళ్లబోయింది తెల్ల మేక.

"ఆగు. ఆ కుక్కలు మన శత్రువులు. అవి మీద పడ్డాయంటే మనల్ని మనం రక్షించుకోలేం. మనల్ని కాపాడే మనుషులు కూడా ఎక్కువగా కనపడ్డం లేదు. అటు వెళ్లకు. ఇవాళ ఆదివారం. జనం ఎక్కువగా లేరు. దుకాణాలు కూడా తెరవలేదు" అది కాస్త భయంగా నల్లకుక్క.

"నీ భయం కాకపోతే, రోజూ ఈ బజార్నే వెళ్తున్నాం. పండ్ల దుకాణం పండరి పారేసిన పండ్లు, అరటి తొక్కలు తింటున్నాం కదా. కొత్తగా నీకు భయమెందుకు? ఏ రోజూ మనల్ని కరవని కుక్కలు ఇవాళెందుకు కరుస్తాయి?" అంది ప్రశ్నను లేవదీస్తూ తెల్లమేక.

"నాకు ఏ లాజిక్కూ తెలీదు. కానీ అక్కడున్న కుక్కలన్నింట్లోకి ఒక దానికి ధైర్యం తక్కువ. అవిగాక అక్కడ మరో నాలుగు ఉన్నాయి చూడు. ఇప్పుడు వాటికి తెగింపు ఎక్కువ. అదీగాక మస్తాన్ మాంసం దుకాణం రెండు రోజుల నుండి తెరవలేదు. ఆ కుక్కలు ఆకలి మీద ఉండి ఉంటాయి. మనం అక్కడ కనిపిస్తే అమాంతం మనమీదకి దూకి చంపేస్తాయి. ఎందుకైనా మంచిది. ఈ ఒక్కరోజు మనం వాటికి దూరంగా పోవడం ఉత్తమం అనిపిస్తోంది" అంది నల్లమేక.

"నువ్వట్టి బెదురు బకరావి. నేనే ముందు ధైర్యంగా వెళతా. ఆ తర్వాతే నువ్వురా. వీటి కన్నా మహా మహా గండు కుక్కల్నే తప్పించుకున్నాను. అంతగా మీదకొస్తే, నా కొమ్ముల్తో ఒక్క కుమ్ము కుమ్ముతాను. పేగులెల్లి చస్తాయి" అంది తెల్లమేక మూర్ఖంగా.

"సరే నేనీ తుమ్మచెట్టు ఆకులు తింటాను. నువ్వెళ్లు. నవ్వెళ్లాక ప్రమాదం లేకుంటే అప్పుడు వస్తాలే" అంది నల్ల మేక.

"ఎన్ని ఆకులు తింటే కడుపు నిండాలి. హూ...నవ్వొట్టి పిరిగ్గొడ్డువి" అని దుకాణం ముందు నుండి వెళ్లింది తెల్లమేక.

అసలే ఆకలి మీదున్న గోధుమరంగు కుక్క అమాంతం తెల్లమేక మీదకు దాడిచేసింది. భయంతో అది మేఁ... మేఁ... అనరుస్తూ వెనక్కి తిరిగి పారిపోదామనుకుంది.

కానీ అప్పటికే మంచి ఆకలిమీదున్న కుక్కలు తెల్లమీక మీద పడ్డాయి. క్షణాల్లో దాన్ని చీల్చి చంపేశాయి. అందిన చోటల్లా మాంసం పీక్కుని తిని వాటి ఆకలి తీర్చుకున్నాయి.

తన మాట వినకుండా మూర్ఖంగా ప్రాణాలు పోగొట్టుకున్న స్నేహితుని తలచుకుంటూ దూరంగా వెళ్లిపోయింది నల్లమేక.

- పుప్పాల కృష్ణమూర్తి

అన్నీ చాక్లెట్లే!

కలలు కననివారుంటారా! ఆ కలల్లో ఎన్నో వింతలు... విడ్డూరాలు... ఒక్కోసారి మనం చాక్లెట్ ప్రపంచంలోకి కూడా జారిపోతుంటాం. అందులో ప్రతీదీ చాక్లెట్‌తో చేసిందే. చూస్తుంటేనే నోరూరిపోతుంది. అలాంటి చాక్లెట్ ప్రపంచమే ఇప్పుడు మీ ముందుకొచ్చింది. కాకపోతే చూసి పెదాలు తడుపుకోవడం మినహా ఏమీ చేయలేం! ఏవంటారు?!